

# GRIPE-COL

**(For Children's Disorders)**

**A MECLEC PRODUCT**

HEPATOGEN · BETA GEN · FERRADAGEN · GRIPE-COL · MALT-EXTRACT · MECLEC

## మెక్ లెక్

# గ్రైప్ - కాల్

శిశువులయొక్క, పసిబిడ్డలయొక్క ఆరో
గ్యము, అభివృద్ధికిగాను ఉపయోగించు
రుచికరమగు పానీయము.

పిల్లలకు సాధారణముగా వచ్చు అజీర్తి,
కడుపుబ్బరము, కక్కులు, విరేచనములు,
పళ్లు మొలచునపుడు కల్గు నల్తలు మొదలగు
వానిని పోగొట్టుటకు మిక్కిలి ఉపయోగించును.

మీ బిడ్డలను ఆరోగ్యవంతముగ నుంచుటకు
**గ్రైప్ - కాల్‌ను** తప్పక వాడుడు.

అన్ని మందుల షాపులలోను దొరకును,

కంపెనీనుండికూడ వ్రాసి తెప్పించుకోవచ్చును :

**The Meclec Nutriments & Pharmaceuticals Ltd.,**

Armenian St., :: G. T. Madras.

పిల్లలకు ఒక కథ

# మనలను శుభ్రముగా ఉంచుకొనుట



అమ్మకు సుబ్బీమీద టిమూ మీద ఇష్టత ఏర్పడిన విధము, నేను శుభ్రముగాను టీకుగాను కనబడిన విధము ఇది.

కాని:

ఏలాగో మేము ఒంటరిగా యున్న క్షణమందు దుమ్ముతోను, మురికితోను ఎల్లప్పుడు కప్పబడియుండుము. తిరిగి నీళ్ల పోసుకోవటమంటే మేము అసహ్యపడుతూ ఉండేవాళ్లము.

## అంతట

అమ్మ హమామ్ సబ్బును కొన్నది. ఇప్పుడు దుమ్ములో తిరిగినతరువాత నీళ్ల పోసుకోవటమంటే మాకు నిజంగా ఆనందం. హమామ్‌సబ్బు పెద్దబిళ్ల పుష్కలంగా సువాసన గల నురుగును ఇస్తుంది మొన్న ఒక రోజున చెప్పకుండానే, సుబ్బీ వెళ్లి ముఖం కడుక్కుంది. టిమూ, నేను, అదే మొదలుపెట్టాము.






## భారతదేశజనులు మక్కువతోవాడే సబ్బు

ది టాటా ఆయిల్ మిల్స్

కం. లి. వారిచే

తయారు చేయబడినది.



# ఆనంద్ బ్రదర్సు

## పరిశ్రమదారుల ఏజంట్లు, డిస్ట్రిబ్యూటర్లు

దక్షిణ ఇండియాలో అంతటనూ, బొంబాయి రాష్ట్రంలోను మా విక్రయ సంస్థలున్నవి. అందుచేత మేము ప్రాతినిధ్యం వహించే పరిశ్రమదారు లందరి పక్షాన నిపుణవంతంగా పనిచెయ్యగల సంపూర్ణమైన అవకాశాలు కలిగియున్నాము.

ఈ క్రిందివారికి మేము ప్రతినిధులము

ఆంధ్రా పేపర్‌మిల్సు కంపెని, లిమిటెడ్, రాజమండ్రి.
బెంగాల్ బెల్టింగువర్క్సు లిమిటెడ్, కలకత్తా.
డెక్కన్ పేపర్‌మిల్సు కంపెని, లిమిటెడ్, పూనా.
కనరా పల్ప్ & పేపర్‌మిల్సు కంపెనీ, లిమిటెడ్, బొంబాయి.
డ్రగ్‌హౌస్ (ఇండియా) లిమిటెడ్, కలకత్తా.
మాయా ఇంజినీరింగ్ వర్క్సు, కలకత్తా.
రిలయన్సు అష్యూరెన్సు కంపెని, లిమిటెడ్, బెంగుళూరుసిటీ.
ఆచార్య & ఆచార్యాస్ లిమిటెడ్, బెంగుళూరు.

♦♦♦ ఆఫీసులున్న పట్టణాలు ♦♦♦

మదరాసు, బొంబాయి, షోలాపూరు, కోయంబత్తూరు, బెజవాడ, బెంగుళూరు, షిమోగా, శికందరాబాదు.

♦♦♦ మా డిపోలున్న తావులు ♦♦♦

మైసూరు ♦♦ బీజపూర్.

★ జర్మెక్సు ★

అన్ని చర్మవ్యాధులను నివారించే 'ఏంట్ సెప్టిక్' ఆయింటుమెంటు




తామర,

గజ్జి,

మొటిమలు,

కురుపులు,

కోతలు,

మొదలగువాటన్నిటిని సులభముగా నివారించును.

లిటిల్స్ ఓరియంటల్ బాం అండ్

ఫార్మ స్యూటికల్స్ లిమిటెడ్,

పో. బా. నెం. 67, మద్రాసు 1

ప్రసిద్ధిచెందిన తిలక్ మార్కు మిస్కి ఇంగువనే వాడండి.




వాసనకున్నూ రుచికిన్నీ శ్రేష్ఠమైనది. • అన్నిచోట్లలోను దొరుకును.

గోపాల్‌జి చాంప్‌షి & కో.

(ఇంగువ వ్యాపారం)

30, గోవిందప్పనాయకన్ వీధి, మద్రాసు.

హెడ్డాఫీసు:
బొంబాయి.
బ్రాంచి:
మధుర.

# వ్యాపారస్థులారా !

కావలసినచో తక్కువ ధర కిచ్చే స్థలానికి రండి.

మరియు వ్యాపారస్థుల మన్నికల ననుసరించి, బైటూరి ఆర్డర్లను నిరంతరం సప్లయిచేయుటకు విశేషంగా నిల్వచేసి వుంచినాము, మా కంపెనీయందు,

| | | | |
|---|---|---|---|
| మాచికాయ | నేర్వాళం | కస్తూరిపసుపు | వాయువులంగ |
| జాజికాయ | ద్రాక్ష | మాసుపసుపు | అజమోదరం |
| జాపత్రి | అల్లొగడ | లవంగపట్ట | గుగ్గిలము |
| సన్నరాష్టరం | శొంఠి | లవంగాలు | వట్టివేరు |
| పిప్పళ్లు | మిరియాలు | ఏలక్కాయ | వస |
| నల్ల జీలకట్ట | కిచ్చిలిగడ్డలు | గసగసలు | |

ఇల్లాంటివి మావద్ద యితర రకాల మందుల మూలికలు లెక్కలేనన్ని లభించును.

లభించు స్థలము :

## D. PEIRIS & CO., ఎగుమతి దిగుమతిదారులు

మద్రాసు ఆఫీసు :
23, 24 భద్రయ్యాన్ వీధి,
జి. టి. మద్రాసు.
**TELE : SUMATIPALA**

హెడ్ ఆఫీసు :
8, 10 కపోస్ లేన్,
కొలంబో.
**TELE : REDWOOD**

---

# ఐటీయాల్

## ఆదర్శప్రాయమైన దుర్గంధనివారిణి.

### ఘాటైనది, కాని, హాని చేయనిది

### నరకులను, గాయాలను మాన్పును

### పుక్కిట పట్టుటకుగాని, పరిశుభ్రతకుగాని ఉపయోగపడును

I·T·L
ప్రొడక్టు

సెల్లింగ్ ఏజెంట్లు: బెస్ట్ అండ్ కంపెనీ, లిమిటెడ్.,
పోస్టుబాక్సు నెం. 63, మద్రాసు.





డోంగ్రేగారి బాలామృతము
బలహీనమైన బిడ్డలకు
బలమున్ను, పుష్టియున్ను,
ఆరోగ్యము నిచ్చును.

*Prop.* **Dongre & Co., Bombay. 4**

---

## రీటా తలవెండ్రుకలను పెంచును




రీటా కుదుళ్ళకు బలమునిచ్చి, నిగనిగలాడు నిడుపాటి వెండ్రుకలను పెంచుటకు అద్భుతమైన హెయిర్ టానిక్. తల వెండ్రుకలు రాలుట, నెరయుట, చుండ్రు, బట్టతల, పేనుకొరుకు, ఇంకను తలవెండ్రుకలకు సంబంధించిన సమస్తవ్యాధులకు రీటా అమోఘముగ పనిచేయును. వేనకువేలు వాడి గుణమును పొందియున్నారు. మీరుకూడ నేటినుండి రీటాయే వాడుడు.

రీటా హిందూదేశమంతటా
దొరకును. సీసా 15అ.

**RITA**
**HAIR TONIC**






'BALA' CHILDREN'S ILLUSTRATED MONTHLY.

సంపాదకుడు : న్యాయపతి రాఘవరావు, బి.ఎ.

సహాయ సంపాదకురాలు : న్యాయపతి కామేశ్వరి, బి.ఎ., ఎల్.టి.

సంపుటి 2.] మదరాసు, నవంబర్, 1946 [సంచిక 4.

# "జట్టు"

ఈమధ్య నేనొక స్నేహితుడింటికి వెళ్ళాను. ఆ ఇంటిదగ్గర కొందరుపిల్లలు ఆడుకుంటున్నారు. ఒక మూలని ఒక అమ్మాయి కూచొని ఏడుస్తోంది.

"ఎందుకమ్మా అలా ఏడుస్తున్నావ్?" అని అడిగాను.

"నన్ను వాళ్ళ జట్టులో కలుపుకోలేదు. ఉహుఁ...ఉహుఁ... ఉహుఁ..." అని ఏడ్చింది.


"ఏఁవర్రా, పాపం, ఆ అమ్మాయిని మీ జట్టులో ఎందుకు తీసుకోలేదు?" అని నేను అడిగాను.

"ఆ అమ్మాయికి చెముడు, మెల్లకన్ను...అబ్బే! ఆ అమ్మాయి మాకొద్దు"—అన్నారు.

ఆనాడే పనుండి ఒక బడికి వెళ్ళాను. అక్కడకూడా పిల్లలు జట్టుకట్టుకొని కబుర్లు చెప్పుకుంటున్నారు. ఈ జట్లలో ఒక విచిత్రం చూచాను. గొప్ప పిల్లలందరూ ఒకచోట జట్టు కలిశారు. వాళ్లు బీదపిల్లల్ని చేర్చరు. కొందరు తమకన్నా బీదపిల్లలతో మాట్లాడరు కూడాను.

పాపం, చెముడు, మెల్లకన్ను, కుంటికాలు, బీదతనం, బక్కపేగులు ఇవి ఏవైనా వుంటే తప్పా? అది వాళ్ళతప్పు కాదే! అటువంటి వాళ్ళకి ఉత్సాహమిచ్చి మీరు అన్ని విధాలా సహాయం చేయాలి. ఆటల్లో, పాటల్లో అందరూ కలిసిమెలిసి వుండాలి. అందులోనే వుంది మీ గొప్ప. ఏం?

"అన్నయ్య"




# గడియారం

'టిక్ టిక్' మనురా
గడియారం
'టింగ్ టింగ్' మ్రోగును
గడియారం
కాలమంతటిని
గడియారం
గడ గడ త్రాగును
గడియారం

★

అద్దమువైపున
చూడుమురా
అట పండ్రెండంకెలు
ఉన్నవిరా
అంకెలపై నల్లదుగోరా
రెండుముండ్లు అగు
పించునురా!

★

పెద్దముల్లును
చూడుమురా
అది నిముషములెన్నో
తెల్పునురా
చిన్నముల్లు అల్లదుగోరా
అది గంటలు ఎన్నో
చూపునురా

★

పెద్దముల్లు ఒక గంటకుయే
పండ్రెండంకెలు తిరుగునురా
చిన్నముల్లు ఒక అంకెకుయే
గంటకాలమూ నడుచునురా

★

పండ్రెండు గంటలొక
పగలగును
మరి పండ్రెండూ ఒక
రాత్రగును
పగలూ రాత్రి కలసినచో
రోజు ఒకటిగా చెప్పనగు


రచన: బి. వి. వి. ఆర్. సత్తెనపల్లి

# నెలలు....రోజులు

అనుకరణ: పమ్మి రామశాస్త్రి
(హెడ్మాస్టర్, బోర్డు బాలికా పాఠశాల, పెంటపాడు)

రోజులు ఏనెల కెన్నో తెలుసా?
నవంబ రేప్రిల్ సెప్టెంబరుకూ
జూనుకు ముప్పై రోజులె ఎపుడూ;
ఫిబ్రవరికి ఇర్వది ఎన్మిదియే;
మిగిలిన నెలలకు ముప్పైయొక్కటి;
లీపియరైతే, అగు ఫిబ్రవరికి
ఇరువదితొమ్మిది రోజులు బాలా!





# హాత్! కాకీ!

కావు కావు
కాకి వచ్చె!
హాత్తు! హాత్తు!
హాత్తు కాకి!
రివ్వు రివ్వు
రొట్టె పాయె....
వెక్కి వెక్కి
బిడ్డ ఏడ్చె!

సంపాదన: గంటి ప్రభావతి (అనకాపల్లి)

# లాలింపు

ఎందుకో పాపాయి
కెవ్వుమని యేడ్చింది!

గబగబా వాళ్లమ్మ
ఊరుకో పెట్టింది!

కడవతో గోమాత
పాలనూ యిచ్చింది!

పూలలో తేనెనూ
తుమ్మెదా తెచ్చింది!

కోయిలా గొంతులో
వీణలూ పలికాయి!

పాపాయి కళ్లల్లో
కాంతులూ మెరిసాయి!

బంగారు తల్లల్లె
పాపాయి నవ్వింది!

వాళ్లమ్మ యెంతోను
లోలోన మురిసింది!


రచన: పుల్లేవు సుందరరావు.
(కాకినాడ)

# ఏనుగూ - దోమా

రచన: టి. ఇంద్రదేవ్ శ్రీరామమూర్తి ఎం. ఏ.

అనగా అనగా ఓ రాజుగారున్నారు. ఆయన చాలా పెద్ద రాజుగారు-కత్తేమో ఇక్కడ నుంచి రోడ్డుదాకా ఉంటుంది. దాంతో దొంగల్నందర్నీ చంపేస్తూ ఉండేవాడు. ఆయన సైన్యంలోనేమో బోలెడన్ని గుఱ్ఱాలు ఏనుగులు. గుఱ్ఱాలు అంటే ఏమన్నా మామూలు జట్కా గుఱ్ఱాలనుకున్నావేమిటి? బాగా చెయ్యెత్తినంత పైకి ఒస్తుంది వీపేను. ఇంక ఏనుగులో-ఓయి బాబో మా ఊళ్లో కొండలు వాటితో పోలిస్తే వెంకటరత్నంగారి అబ్బాయి గోళీల్లల్లే ఉంటాయి. ఈ ఏనుగుల్లోనే ఓ పెద్ద ఏనుగుంది. అది అసలు అన్నిటికి రాజన్నమాట. నల్లగా కరిధూపం అల్లే ఉండేది. ఓ తాటి చెట్టుమీద ఇంకో తాటిచెట్టు పెట్టి, దానిమీద ఓ కొబ్బరిచెట్టు పెట్టినంత ఉండేది. అంత పెద్దదన్న మాట.

రోజూ రాజుగారి ఏనుగు ఊరంబడి వెళ్తూంటే ఓ! ఊళ్లో పిల్లాళ్లందరూ దానివెంటే పరిగెత్తడం. రోజూ సాయింత్రం కాగానే చెరువుకి స్నానం చెయ్యడానికి వెళ్తూండేది. అక్కడేమో శుభ్రంగా ఒళ్లంతా కడుక్కొని కడుపునిండా మంచినీళ్లు తాగి ఒచ్చేదన్నమాట. ఆ ఊళ్లో చెరువుకి ఓ గొడవ ఉంది. దాని నిండా దోమలు. అవి అసలు మామూలుగా ఎవరి జోలికి పోయేవికావు. అందులో ఏనుగంటే ఈ దోమలకి కూడా భయమే. మరి ఓ రోజున ఏం పోయికాలం ఒచ్చిందో-ఆ దోమల రాజు, ఓ పెద్ద పోతంతది; తుసుక్కున ఏనుగు తొండంలో దూరి కూర్చుంది. ఇంకేముంది. ఏనుగికి ముక్కులో గుల గుల, దురద, చిర చిర, చిరాకు, ఒకటేమిటి పిచ్చెత్తినట్లయింది. ముక్కులో దోమ దూరితే ఎట్లా ఉంటుందో తెలుసా? కావాలంటే నువ్వు ప్రయత్నించి చూడు.



'అఖు, అఖు, అఖు, ఆ—ఖూ' అని ఎంత గెంతితేమట్టుకు అది బయిటికి ఒస్తుందా! 'అహ్హా ఖూ' అందిట. దోమ పోలేదు, 'ఉహ్హా ఖూహ్హా' అందిట. దోమ బయిటికి రాలేదు.

''మా బాబుగాదూ రావూ?'' అబ్బే; ''మా తల్లిగాదు. పోవూ'' అహ అల్లాగు వినలేదు దోమ.

ఇంక ఏనుగయ్యా లంచం ఇయ్యాపోయాట్ట. ఎవళ్లన్నా దుష్టుడికి లంచం ఇస్తారా? తప్పుపని గాదూ? కాని ఏనుగుకి ఇదంతా ఏం జ్ఞాపకం అవతల ముక్కు మండిపోతుంటే!

''అందెలు పెడతా నీకు రావే దోమా! ఖూ'' అందిట.

''గజ్జెలు పెడతా! ఖూ''

''కడియాలు పెడతా! ఖూ''

''పాంజేపట్టీలు పెడతా! ఖూ''

''మట్టెలు పెడతా! ఖూ''

ఎన్నిస్తానంటుందో చూశావా బాలా! నువ్వు అయితే ఆ ఏనుగు ఇస్తానన్న వాటికి ఒకటిగాదు. ఎనిమిది ముక్కుల్లోంచి ఒచ్చేదానివి గాదూ! కాని దోమలకి ఆ బుద్ధి ఉండదుగా.

''ఒడ్డాణాలు పెడతా! ఖూ''

''గజ్జెల ఒడ్డాణాలు పెడతా! ఖూ'' (మా అక్కయ్య చక్కగా గజ్జెల ఒడ్డాణం పెట్టుకుంటుంది. ఎం చక్కా ఉంటుంది.)

''బంగారపు పటకా పెడతా! ఖూ''

"కంటెలు పెడతా! ఖూ"

"కాసులు పెడతా! ఖూ"

"చంద్రహారాలు పెడతా ఖూ"

"వజ్రాలహారాలు పెడతా ఖూ"

"ముత్యాల తావళాలు పెడతా ఖూ"

"ముక్కు పుడకలు పెడతా! ఖూ"

"అడ్డబాసలు పెడతా! ఖూ"

"చంద్రవంకలు పెడతా! ఖూ"

"దుద్దులు పెడతా! ఖూ"

"లోలాకు పెడతా! ఖూ"

"జడబిళ్ళలు పెడతా! ఖూ"

"మురుగులు పెడతా! ఖూ"

"వంకీగాజులు పెడతా! ఖూ"

"కట్టెవంకీలు పెడతా! ఖూ"

అబ్బే ఏమీ లాభంలేదు. అంతటితో ఊరుకోక ఇంకా ఉప్మా, పులిహోర, బొబ్బట్లు, ఆమడలు, గారెలు. పకోడీలు, చేగోడీలు, గులాబ్ జాంలు, జంతికెలు, కోవాబిళ్ళలు, దోసెలు, అరిసెలు, మైసూరీపాకు, రవ్వోరా, పాయసం, బోండాలు, పాకం పూరీలు, జిలేబీ, బర్ఫీ, హల్వా, దూద్ పేడా, లడ్డు, కారబూందీ, అటుకులు, వేరుశెనగ ఉండలు, చిమ్మిలి. మినపసున్ని, జున్ను మరివెన్నమీగడ, పేరిననెయ్యి...

ఒకటేమిటి? అన్నీ ఇస్తానందిట. ఒట్టిదే. దోమకి అంతకంతకి గర్వంకూడా ఎక్కువవుతోంది. నాకేకదా ఇవన్నీ అని. ఈలోపున ఏనుగుకి ఏడుపొచ్చేటంత పర్యంతం అయింది. రాజుగారు ఏనుగుకి బోలెడంత జీతం ఇస్తారుగా. అదంతా ఖర్చుపెట్టేద్దామన్నగూడా రావటంలేదు ఈ దోమ!

దాంతో ఏనుగుకి ఒళ్లుమండిపోయిందిట.

"ఘీ—ఘీఘ్హాఘీ, ఘీ" అని ఒక్క బృంహింతంచేసి తొండం కాస్తా ముక్కులో పెట్టి గిరగిర తిప్పేటప్పటికి, దోమ కాస్తా చచ్చి ఊరుకుందిట! అక్కడినుంచి ఏనుగు చక్కా టుక్కూ టుక్కూ అడుగు లేసుకుంటూ దివాణానికి వెళ్ళిపోయిందిట.

వేడి వేడి బువ్వ వెచ్చటి పక్కకూ అమ్మ కేకేస్తోంది. మీరుకూడా లేవండి.

# అ ఆ లు

అకాఁ!

ఆవుని

ఇంటికి

ఈడ్చుకురా!

ఉంచు

ఊఁ! పాలుతీయి.

ఎందుకు?

ఏమిచేసేది?

ఐతే!

ఒక గిన్నెలో పోయి

ఓహో! పాయసము వండనా?


ఔను.

అందుకు.

అః ఆహా!

రచన : బి. లలిత, (తంగుడుబిల్లి)

# వీణ నేర్చుకోండి



ఈ అమ్మాయి చి॥ గిడుగు చెల్లాయమ్మ. చిన్నతనంలోనే వీణ బాగా వాయించడం నేర్చుకుంది. మిమ్మల్నికూడా నేర్చుకోమంటోంది.


# గ్రైప్ సిరప్




గ్రైప్ సిరప్ చంటిపిల్లలకు, శిశువులకు బాధలేని, హాయి అయిన విరేచనకారి. పిల్లల ఆరోగ్యాన్ని గురించి కాస్త అనుమానం తగిలితే, ఒక మోతాదు గ్రైప్ సిరప్ యివ్వండి.

ఐ. టి. యల్. ప్రొడక్టు

సెల్లింగ్ ఏజెంట్లు:

బెస్ట్ అండ్ కంపెని లిమిటెడ్


పోస్టు బాక్సు నెం. 63, మద్రాసు.

BGK-15-TE



## ఏడ్చు వారిని నవ్వించును






# నీడబొమ్మలు

రాత్రి, దీపంకీ గోడకీమధ్య మనచెయ్యి అడ్డుపెడితే, గోడ మీద మన చెయ్యినీడ పడుతుంది. ఈ బొమ్మలోలాగ మన వేళ్లపెడితే గోడమీద నీడబొమ్మలు తయారవుతాయి. కుందేలు, గబ్బిలం, కుక్కమూతి, ఒంటె, గొఱ్ఱె—ఇలాగ బొమ్మలు పడేటట్టు చేయగలం. చూచారా తమాషా.

సంపాదన: దిట్టకవి లక్ష్మీమోహనరావు, భీమునిపట్నం.


## బిటాలాక్స్

చాక్లెట్ భేదిమాత్రలు

సుఖవిరేచనౌషధము.




ఇది చాక్లెట్ భేదిమాత్రలు. సుఖవిరేచనము కలిగించి మలబద్ధమును పోగొట్టి మంచి జీర్ణశక్తి నిచ్చును.

పొట్లం రెండు బిళ్లలు 1 అణా.

అన్నిచోట్ల దొరకును.

తయారుచేయువారు:

**Bombay Tablet Manufacturing Co,**

**Post Box No. 2092, BOMBAY**

# దీపావళి

## కాలుస్తాం - మేం - పేలుస్తాం!

మెరుపులు, మంటలు
వరుస దీపాలు!
ఎఱ్ఱని, పచ్చని
మతాబాలు
రివ్వున లేచే
రవ్వల చువ్వలు
బుస్సు బుస్సుమను
చిచ్చు బుడ్డీలు
చిటపట, ఢాంఢాం
చక్ర పటాకులు
ఢఫేల్, ఢఫేలను
గోడ పటాషులు
కాలుస్తాం-
మేం పేలుస్తాం!
దీపావళి మేం
పాలిస్తాం!

రచన: సోమయాజుల వెంకటరామమూర్తి
బి. ఎ. యల్. టి,

## మా ఇంటి బాల దీపావళి

మా బాల చూచింది
దీపాలు వెలిగాయి!
మా బాల నవ్వింది
ముత్యాలు రాలాయి!
మా బాల పాడింది
పూవులే పడ్డాయి!
మా బాల ఆడింది
మెరుపులే మెరిశాయి!
మా బాల చూపులే
మా బాల నవ్వులే
మా బాల పాటలే
మా బాల ఆటలే
మా ఇంటి దీపావళీ
మా కెపుడు దీపావళీ

రచన: "గురువుశెట్టి"




రచన: కవికొండల వేంకటరావు

చిన్నాడేమో కొన్నాడు!
చీమటపాకాయ కొన్నాడు!
"చీమలకోసం" అన్నాడు!

★

నల్లచీమ పైకెక్కింది,
టపాకాయనే నడిపింది;
పుల్లచీమ తాగిసింది,
అగ్గిపుల్లనూ వేసింది;
ఎఱ్ఱచీమ వొత్తంటించె,
ఢామ్మని పటాసు పేలించె.

★

పుల్లచీమ తెలిబుగ్గైంది
నల్లచీమ నల బొగ్గైంది;
ఎఱ్ఱచీమ తానేమైందో?

చిన్నాడొళ్లు కందేలా
కుట్టేసింది, పట్టేసింది!
"అమ్మో! అమ్మో! ఫైరింజన్
పిలువే, గణగణ పిలిపించేవ్!
భగభగ మండేన్ నామెడనే
నాయొడునే, ఎదొనాతొడనే!"

★

చిన్నాడూరకె కేకల్లు!
చిన్నాడికళ్లు చెమ్మల్లు!

★

ఎఱ్ఱచీమ కాశ్చర్యముపెల్లు!
చేతనలిపితే అదిచెల్లు!
నలపకపోతే నరకుండు
సత్యభామ చంపేవరకుండు!

# ★ నా య కు లు

రచన: మాధవపెద్ది

స్థలం: జాతీయ అంగడి
(దసరా పద్యం పంథాలో చదవాలి)

శెట్టి:– అమ్మ్తానండి నే – నమ్మ్తానండి
మందుసామగ్రి నే – నమ్మ్తానండి
బాల బాలికలార – వేగముగ రండి

బాల:– ఓ అబ్బి! ఓ అబ్బి! – నామాట వినుము
మతాబాలున్నవా – మేలు రంగులవి
కాకరా కాడలా – ఖరీదు ఎంత?
ముత్యాల పవలత్తు – నా కెంతొ ప్రీతి
కప్ప గంతం టేను – కడుప్రీతి నాకు
నీవద్ద ఏ మేమి – రకములున్నవియొ
వేగముగ చెప్పుమా – విపులంబుగాను

శెట్టి:– జవహరు బాబుజీ – జువ్వాలు ఇవిగో
శరత్ బోసూవారి – సీమ టపాకాలు
పటేలు పవలతులు – ప్రశిద్ధి సుమ్మ

# టపాకాయలు ★

శా ర దా దే వి, (గుంటూరు)

శ్రీమాన్ లవారిసి - సింద్రీలు గనుడు
పట్టాభివారివే - గొట్టాలమందు
జిన్నాసాయిబుగారి - జిల్లీలు ఇవుగో...

బాల:— చాలించు చాలించు - ఓ షాహుకారు
ఆంధ్రకేసరి వేమి - లేవ నీ వద్ద?

శెట్టి:— ఖద్దరు విధానంబు - కాన్కగా మనకు
మద్య పిశాచంబు - పార దోలుచును
మందొకటి ఇచ్చాడు - మక్కువతో నేడు
నాయకుల పేర్లతో - నా సరకులన్ని
అమ్మ జూపితి ఇపుడు - కొనవమ్మ బాల

బాల:— అన్నతో నే నిపుడె - అంగడికి పోయి
చక్కని రాట్నమును - నిక్కముగ నేను
కొని తెచ్చి తీసెదా - కొమరొప్ప నూలు
ఆంధ్రకేసరియొక్క - ఆజ్ఞానుసారం.

జ యా !

# వింతలు! వింతలు! వింతలు!

సంపాదన: "దేవకీనందన"

## కుక్కలు మాట్లాడుట!

మాటలు నేర్చిన కుక్కను వేటకు తీసుకు వెళ్లి, "ఉసుకో" అంటే కుక్క పరుగెత్తకుండా "ఉసుకో" అంది అని అమ్మమ్మ చెప్పిన కథ తప్పితే మనకు నిజంగా కుక్కలు మాట్లాడుతాయి అని యింతవరకు తెలియదు.

కాని యిప్పుడు కుక్కలు మాట్లాడగలవు అని తెలుస్తోంది. ఇంగ్లాండు దేశంలో ఒక కుక్క ఉందిట. దానిపేరు "బెన్". అది స్పష్టంగా మాట్లాడగలదుట! అది మాట్లాడడం (గ్రామఫోను) రికార్డులు కూడా తీశారుట. దానిని "నీకు పిల్లలు ఉన్నారా" అని అడుగుతే అది "నాకు ఒకటి కావాలి" అంటుందిట!

★

## పాము చేసిన మేలు

ఆబూ శిఖరంమీద ఈ మధ్య ఒకరోజున రోడ్డుమీద రెండు పాములు దెబ్బలాడుకుని, ఆ రెండింటిలో బలముగల పాము రెండవదానిని కరిచిందిట. ఆ రెండవది, తెలివితప్పి పడివుంది. ఇదంతా చూస్తూన్న ఒక గొల్ల పిల్లవాడు ఆ పడివున్న పాము మీద ఒక తడిబట్ట వేశాడుట.

ఇంతలో మొదటి పాము గబగబా వచ్చి, గొల్లపిల్లవాడిని కూడా కోపంతో కరిచిందట! గొల్లపిల్లవాడు కూడా స్పృహ తప్పి పడిపోయాడు. ఇలావుండగా కొంతసేపటికి, తడిగుడ్డ క్రింద వున్న పాముకి తెలివి వచ్చింది. తనకు సహాయంచేసిన గొల్లపిల్లవాడు పడివుండడం చూచి, సంగతంతా గ్రహించి ఆ పిల్లవాడిలోని విషం అంతా పీల్చివేసిం

లిట. అప్పుడు ఆ పిల్లవాడు బ్రతి కాడుట!

★

## పిల్లిపిల్లంత పిల్ల!

న్యూయార్కులో ఈమధ్య ఒకామెకు ఒకపౌను బరువు మాత్రమే వున్న బిడ్డ పుట్టిందిట! ఆ బిడ్డ, పిల్లిపిల్లంతే వుందిట! ఇంతవరకూ ప్రపంచములో ఎవ్వరికీ ఇంత చిన్నబిడ్డ పుట్టలేదుట.

★

## ఏనుగు తిండి

ఏనుగులు రోజూ సుమారు 20 గంటలు ఎప్పుడూ ఆహారం తింటూనే వుంటాయి. రోజుకి ఒక రెండు గంటల కాలమే విశ్రాంతి తీసుకుంటాయట.

## దూడ మనిషి

సంయుక్త రాష్ట్రాలలో ఝూన్సీ పట్టణం దగ్గర ఒక ఆవుకు ఒక దూడ పుట్టిందిట. ఆ దూడ తలకాయ మనిషి తలకాయలా వుందిట. కాళ్లు ఒంటె కాళ్లు, తోక లేదుట. అది చంటిపిల్ల ఏడ్చినట్లు ఏడుస్తుందిట. కళ్ల వెంట నీళ్లు కూడా వస్తాయిట!

★


## పుట్టుకతోనే పళ్లు!

ఈ మధ్య ఇంగ్లాండులో గ్లాడిస్ సిమెన్సు అనేఆమెకు ఒక ఆడపిల్ల పుట్టిందిట. ఆ పిల్లకు పుట్టేనాటికే రెండు ముందర పళ్లు వున్నాయిట!

## పో లి క లు




# ఏ జెండా కావాలి?



డ్రాయింగు మాస్టరు :—బాలా! ఈ రెండు జెండాలలో ఏ జెండా రాస్తావు?

బాల :— ఆ మీదిజెండా చాలాసార్లు రాశానండి. ఇంక అది మాకొద్దు. ఈ కింది జెండాయే కావాలి మాకు.

—జై హింద్.



# జాతీయ పతాకం

రచన: ధూళిపాళ్ల కృష్ణమూర్తి

మన జాతీయ నాయకుల జన్మ దినోత్సవాల సందర్భాల్లో మనం తరుచుగా దీన్ని ఉపయోగిస్తాం. మన దేశంలో జాతీయాభిమానం గలవారందరూ ఈ పతాకాన్ని వాళ్ల ఇండ్లమీద ఎగరవేసుకుంటున్నారు. సెప్టెంబరు నెల్లో స్వారాజ్యానికి తలుపులు తెరవబడడం చేత ఈ జండాలు భారత దేశమంతా ఒక్కుమ్మడిగా ఇంటింటా వెలిశాయి. ఈ జండాలో వుండే అర్థమేమో మీరంతా తెలుసుకోవాలి.

ఇందులో మూడు రంగులున్నాయి. అవి ఆకుపచ్చరంగు, తెలుపు రంగు, కుంకుమపువ్వ వంటి ఎరుపురంగు, ఈ మూడు రంగులకు అర్థమున్నది. ఆకుపచ్చ రంగు మన దేశంలోని అన్ని జాతులయొక్క ఐకమత్యమును తెలుపును. ఎరుపురంగు మన దేశీయుల పౌరుషమును సూచించును. తెలుపురంగుపవిత్రతనుచూపును.

ఈ మూడు రంగులమధ్య రాట్నమున్నది, రాట్నముద్వారా మన దేశపు పరిశ్రమలు వృద్ధి పరువవలెనని అదిసూచిస్తున్నది. రాట్నం పల్లెవాసులకి కల్పవృక్షం వంటిది అవడంచేత మన దేశంలో వుండే ఏడులక్షల పల్లెలూ రాట్నం వల్లనే వృద్ధిలోకి రావలసిఉన్నవి. పల్లెల్లో పరిశ్రమలు పెంపొందినప్పుడే మన దేశ దారిద్ర్యం తొలగిపోతుంది. అందువల్లనే జాతీయ పతాకానికి, మధ్య

భాగంలో రాట్నంబొమ్మ గీయబడింది. పిల్లలందరూ కలసి జాతీయ పండుగదినాల్లో ఈజాతీయ పతాకాన్ని ఉత్సవం చెయ్యాలి. ఆ జాతీయపండుగలు ఏవో? అవి ప్రతి సంవత్సరంలో ఎప్పుడు వస్తాయో? ఈ విషయాలుకూడా తెల్సుకోవాలి. ఈ క్రింది వే జాతీయ పండుగలు వీటిని ఒక అట్టమీదవ్రాసి మీ ఇంట్లో తగిలించండేం!!!


బాల

ఎడ్వర్‌టైజ్‌మెంట్ల రేట్లు:

| | | |
|---|---|---|
| ఇన్‌సైడ్ ఫుల్ పేజీ | రు. | 50 |
| ,, ఆఫ్ పేజీ | .... | 30 |
| 2 రేపర్, 3 రేపర్ | .... | 75 |
| కడపటి కవర్ (డబుల్‌కలర్) | .... | 120 |


మేనేజర్:

బాల

20, సుందరేశ్వర్ వీధి,

మైలాపూర్, మదరాస్–4.


| | | |
|---|---|---|
| నవంబరు | 14–వ తేదీ | – నెహ్రూ జయంతి. |
| డిశంబరు | 28 | – కాంగ్రెసు జన్మదినం. |
| జనవరి | 23 | – నేతాజీ జన్మదినం. |
| జనవరి | 26 | – స్వతంత్ర దినోత్సవం. |
| మార్చి | 2 | – కస్తూరిబా స్మారకదినం. |
| ఏప్రిల్ | 6–13 వరకు | – జాతీయ వారం. |
| ఆగష్టు | 1–వ తేది | – తిలక్ వర్ధంతి. |
| ఆగష్టు | 9 | – వీరసంస్మరణ దినం. |
| ఆగష్టు | 21 | – క్విట్ ఆసియా దినోత్సవం. |
| అక్టోబర్ | 2 | – గాంధీ జయంతి. |
| అక్టోబర్ | 21 | – ఆజాద్ హింద్ ప్రభుత్వ జయంతి. |
| అక్టోబర్ | 30 | – పటేలు జయంతి. |




కానన్ ష్మిడ్ కు

వేలూరి శివరామశాస్త్రి

అనుకరణం.

# చందమామ

సిరిదేవి పొలంలో పని చేసుకుని తన యిద్దరు పిల్లలనూ వెంటబెట్టుకుని ఇంటికి వస్తూంది. ఇంట్లో దీపం గంటల్లే వెలుగుతూంది.

“ఇంట్లో ఎవరూ లేరు కదా దీపం ఎల్లా వెలుగుతూంది?” అని తల్లి పిల్లల నడిగింది.

“నాన్న కాక మరి యెవరు వెలిగిస్తారు? ఊరినుంచి వొచ్చి ఉండాలి” అని చిట్టి అంది.

అందరూ గబగబా ఇంట్లోకి వెళ్లారు. తండ్రి చిట్టి నొకచేతా చిన్న నొకచేతా ఎత్తుకున్నాడు. వాళ్లు కిలకిలా నవ్వి తండ్రిని ముద్దుపెట్టుకున్నారు.

అన్నం తిని వా రందరూ వాకిట్లోకి వచ్చి మంచాలమీద పడుకున్నారు. వెన్నెల పుచ్చ పువ్వల్లే ఉంది. “చందమామ రావే, జాబిల్లి రావే” అని పిల్లలు పాడుతున్నారు.

“దీపం ఎక్కువ కాంతిగా ఉందా? చంద్రు డెక్కువ కాంతిగా ఉన్నాడా?” అని వాళ్ళ నాన్న అడిగాడు.

"చంద్రుడే" అని వాళ్లిద్దరూ గబగబా చెప్పేశారు.

"ఇంట్లోదీపం చూసిచూడడం తోటే నేనే వెలిగించా నని మీ రనుకున్నారు. అదిగో ఆ ఆకా శంలో చందమామను ఎవడు వెలిగించాడు ?" అని వాళ్ల తండ్రి మళ్ళా అడిగాడు.

"ఇంత చిన్నదే యీ దీపం, ఇది తనంతట తాను వెలగలేదు. ఎవళ్ళో ఒకళ్ళు వెలిగించాలి. కాబట్టి దేముడే యీ చంద్రుణ్ణి వెలిగించి ఉంటాడు" అని చిట్టి అన్నది.

"ఔనౌను దేముడే ఈసమస్త మున్నూ చేశాడు. సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, చెట్లు, పూవులు ఒకటేమిటి సమస్త మూను" అని చిన్న అన్నాడు.

సూర్యుండు చంద్రుండు
చుక్కలుం బూలు
దేవదేవుని శక్తి
తెల్పంగ( జాలు.

---

# వాన

ఒక వర్తకుడు గుర్ర మెక్కి సంతకు వెళ్లి యింటికి తిరిగి వస్తు న్నాడు. అతని దగ్గిర రూపాయల మూట వుంది. నడిదారిలో వాన కొట్టింది. అతడుతడిసి ముప్పందు మయాడు. దేము డన్యాయంగా వాన కురిపించా డని దుమ్మెత్తి పోశాడు.

ఆ దారి కారడవి గుండా పోతుంది. అత డా అడవిమధ్య లో ఉండంగా ఒక దొంగ ఎదురు పడ్డాడు. వర్తకుడు చాలా భయ పడిపోయాడు. దొంగ వర్తకుడి మీద తుపాకీ గురి పెట్టాడు !

వర్తకుడు వెంటనే చచ్చి పోయేవాడే కాని తుపాకి మోగ లేదు. వానకు తుపాకిమందు నిమ్ముకుపోయింది. వానాకాలంలో నిప్పుపుల్లలు నిమ్మకుపోయి వెలగనట్లే వానకు తడిసి తుపాకి మందుకూడా మండలేదు. అది కనిపెట్టి వర్తకుడు గుర్రాన్ని చబుకుతో జాడించాడు. గుర్రం గమ్మున పరుగెత్తుకో పోయింది.

వర్తకుడు దొంగను తప్పించుకో పోయాక ఇలా అనుకున్నాడు: నేనెంత తెలివితక్కువవాణ్ణి? వాన కురిపించినందుకు దేవుణ్ణి అన్యాయంగా తిట్టేశానే? వాన కురియక ఎండేగనుక కాస్తూవుంటే యీపాటికి చచ్చి స్వర్గంలో ఉండేవాణ్ణే. నాపిలలూ నా పెండ్లామూ నాకోసం వృథాగా కనిపెట్టుకుని ఉండే వాళ్లే. నే తిట్టిన వానే నన్ను కాపాడింది. ఇకముందెన్నడూ ఈకింది పద్యం మరచిపోను:—

క్షేమంబుకోరియే చేయు దైవంబు
కాని మానవులకుఁ గాద దర్థంబు.

---

# ఎండ

వానకాలం. ఆకాశం మేఘాలచే బిడాయించుకొని పోయింది. చీకటిపడ్డది. చిటపట చినుకులు పడుతున్నై. నీరు కాలువలుగా పారుతూంది. ఊరంతా బురద బురద.

ఇంట్లో ఒకమూల ఇద్దరు పిల్లలు కూచుని: "ఎప్పుడూ పాడువానే, ఇహ వాన అనేది లేకుండా ఎండ కాస్తే బావుండును" అని అనుకున్నారు. కొద్దిలోనే వారిమాట నెగ్గింది. కొన్ని నెలలదాకా ఆకాశమ్మీద చేటంత మబ్బయినా కనబడలేదు. పొలాలు మలమలా మాడిపోయై. దొడ్లలో మొక్కలు నిలువునా ఎండిపోయినై. తులిసి వెలిసింది. పత్తి పాడయింది.

వారి తల్లి ఆ పిల్లల దగ్గిరికి వచ్చి ఎండ మనకెల్లా కావాలో వానకూడా అల్లాగే కావాలి. మనకెప్పు డేది కావాలో అప్పుడది చేయడం దేవుడి పని. ఎప్పుడూ ఎండే కాయరాదు. ఎప్పుడూ వానే కురియరాదు. అలాగే ఎప్పుడూ సుఖాలే ఉండరాదు. ఎల్లప్పుడూ సుఖాలే ఉంటే మనకు ఒళ్లు తెలియదు. కష్టాలుకూడా ఉండాలి. కష్టసుఖాలు రెండూగనుక ఉంటే లోకానుభవం కలిగి మంచివాళ్లమవుతాం.

ఎండ వానయుఁ గూర్చు
నీశ్వరుం దోరి
సుఖ దుఃఖము లొసంగు
శుభమునే కోరి.

---

# పిడుగుల వాన

రాము డనే కుర్రవాడు అడవిలో రేగికాయలు ఏరుకుంటూ ఉన్నాడు. ఒడి నిండింది. "ఇక ఇంటికి పోదాం" అని అనుకుంటూ ఉండంగా తుపాను గాలి వీచి ఉరుములతో మెరుములతో పెళపెళా వాన వచ్చింది. రాముడు భయపడి దాపున వున్న ఒక మర్రిచెట్టు తొర్రలో దూరి కూచున్నాడు. పిడుగు పడితే పెద్ద చెట్టు మీదనే పడుతుందని వా డెరగడు.

"రామా! రామా! వెంటనే లేచి యీతలికి రా!" అని వానికి వినబడ్డది. రాముడు లేచి యివతలికి వచ్చాడో లేదో పిడుగు పడనే పడ్డది! ఆ చెట్టు మొదటికంటా కూలి తగులడ్డది. నేల వాణికివాణికి పోతూంది. ఆకాశం అరుస్తూంది. వాడికి అప్పుడు నిప్పులలో ఉన్నట్లుంది. కాని వాని కేమీ అపాయం కలుగలేదు. అంచేత వాడు చేతులెత్తి: "దేవుడా నీవే నన్నివతలికి రమ్మని పిలిచి బతికించావ్. నీకు కోటి దణ్ణాలు" అని మొక్కుకున్నాడు. అంతలో "రామా రామా" అని మళ్లా వినబడ్డది. రాముడు చూచాడు. కట్టెలు కొట్టుకుంటానికి వచ్చిన ముసలిది! రాముడు దాపుగా వెళ్ళి "ఎందుకూ పిలుస్తావ్?" అని అడిగాడు.

"నేను నిన్ను పిలువలేదు. మా రాముణ్ణి పిలిచా. వా డా కాలవలో బాతులను కాస్తున్నాడు. ఈ వానకు ఎక్కడనో దాక్కుని ఉంటాడు," అని ఆముసలిది చెబుతూ వుండంగా పక్క పొదలోంచి రాముడు వచ్చాడు.

"నన్ను దేముడే పిలిచాడని నే ననుకున్నా. ఐతే నీవా పిలి

చింది?" అని మొదటి రాము డన్నాడు.

"అయ్యో నాయనా! నేనే పిలిచాగాని దేముడు నిన్ను పిలవ లేదనుకోకు. ఈ ధ్వనిమాత్రం నిజంగా నాలోనుంచే వచ్చింది. కాని నీ వెవరో నే నెరగను. బిగ్గరగా పిలవాలనికూడా ఎరగను. నిన్ని అపాయంనుంచి రక్షించింది మాత్రం దేముడి పిలుపే సుమా." అని ఆమె అన్నది.

రాముడికి కన్నీళ్లు వచ్చె. అమ్మా! నన్ను కాపాడ్డానికి దేముడు నీలో దూరి పిలిచాడు. పిలిచింది నీవే ఐనా కాపాడింది మాత్రం ఆ దైవమే.

అల యదృష్టమువల్ల నమరధు తోడు
సర్వరక్షకుఁడొ కీశ్వరుఁడని చూడు.


## లెక్కల పండితుడు

ఒకవారము క్రిందట మా స్నేహితుని వద్దనుండి నాకొక కార్డు వచ్చింది. దానిపైని మూడు కానుల బిళ్ళయొకటి, కానీ బిళ్ళ యొకటి అంటించియున్నవి.

"కార్డు అర్ధణాచేస్తే నీవు అణాపోస్టేజీ అంటించినావేల?" అని నేనతనికివ్రాసేను.

"నా కామాత్రం తెలియదను కున్నావా? తిరిగి ఆ కార్డు చూడు. మూడుకానులబిళ్ళకీ, కానీబిళ్ళకీ మధ్యను 'మైనసు' పెట్టాను. 3 కానులు–1 కాని=2 కానులు. కనుక అర్ధణాయేను. ఈమాత్రం నీకు తెలియదా?" అంటూ సమాధానం వ్రాసేడు.

రచన: పాలంకి వెంకటేశ్వర్లు
IV Form కాకినాడ



# ప్రకాశము

రచన: డా॥ పోలాకి శ్రీనివాసరావు,
బూరవెల్లి - చికాకోల్

మానవజన్మే ప్రకాశము
మానవగణ్యుడు ప్రకాశము
గృహస్తాశ్రమము ప్రకాశము
గృహోద్ధారకుడు ప్రకాశము
గ్రామజీవనమె ప్రకాశము
గ్రామోద్ధరణుడు ప్రకాశము
మద్యనిషేధము ప్రకాశము
మద్యవినాశుడు ప్రకాశము
ఖద్దరు కట్టుటె ప్రకాశము
ఖద్దరు బెట్టెను ప్రకాశము
వృత్తి విద్యయే ప్రకాశము
వృత్తుల నిలిపెను ప్రకాశము
ప్రధానమైనది ప్రకాశము
ప్రధానియే గద ప్రకాశము
చెన్నరాష్ట్రమే ప్రకాశము
చెన్నకు వెన్నెల ప్రకాశము

## బాల బహుమానాలు

ఈ నెల లాటరీలో యీ దిగువ బాల చందాదారులకు బహుమానాలు వచ్చాయి. ఒక్కొక్కరికి 1 రూ॥ చొప్పున మనియార్డరు పంపబడును.

—మేనేజరు.

| | చందా నెం॥ |
|---|---|
| D. సిరికుమారి (కాకినాడ) | 858 |
| J. S. బాలసంఘం (వారణాసి) | 774 |
| వడ్లమూడి సీతాలక్ష్మి (నెల్లూరు) | 835 |
| B. లలిత c/o Dr. B. V. Nath, (మద్రాసు) | 941 |
| సెక్రటరీ, Village Communist Party, (పైడికొండపాలెం) | 619 |
| H. సూర్యనారాయణమూర్తి, (వుండి) | 832 |
| R. వెంకటేశ్వరరావు, టీచరు (గాదెపాలెం) | 882 |
| D. అమృతవల్లి (కలికిరి) | 916 |
| గొర్రెల రంగాదేవి (కాకినాడ) | 857 |
| తక్కెలపాటి పోతప్ప (యాగవాపల్లి) | 665 |





# బజావో ఢంకా



ముస్లిం హిందూ
పిల్లల్లారా
ముందుకుపోదాం
రారండోయ్.

భారతదేశం
మనదే మనదే
భజావో ఢంకా
బాలల్లారా.

హరిజనక్రైస్తవ
బాలల్లారా
భారతదేశం
మనదేనోయ్.

చీటికి మాటికి
జగడాలాడే
తాతలమాటలు
వినబోకోయ్.


శూరుడు శివాజి
వీరుడు బోసు
భారతీయులే
బాలల్లారా.

రచన:

**కె. సభా**
[సేవాసమితి]
దిగువమాఘం.

భావికాలమున
భారతభూమిని
బాలవీరులే
పాలించాలోయ్.

పదండి పదండి
పదండి ముందుకు
భారతదేశం
మనదే మనదే.




# కలకత్తా

చాలాకాలం క్రిందట మనదేశానికి తూర్పుభాగంలో ఒక చిన్న పల్లెటూరుండేది. ఆ వూళ్లో కాళికాదేవిగుడి వుండేది. అందుచేత ఆ వూరికి ''కాళీఘట్టము'' అనే పేరొచ్చింది. ఆవూరిపక్కనే 'హుగ్లీ' అనే నది పారుతూంది. ఆ వూళ్లో ఏవైపుచూచిన బురద, మురికినీరు కనిపించేవి.

కొంతకాలానికి తూర్పు ఇండియా సంఘంవాళ్లు కాళీఘట్టానికి వచ్చి మద్రాస్ పట్నంలోలాగా కోట నొకదాన్ని కట్టారు. అప్పటినుండి కాళీఘట్టం, చుట్టుపక్కలవుండే పల్లెటూళ్లతో కలసి పెద్ద నగరమైంది. ఇంగ్లీషువాళ్లు ఆవూరిపేరును చక్కగా పలుకలేక కొత్తపేరు పెట్టారు. ఆ పేరేమిటంటే ''కల్ కటా''-లేక కలకత్తా.

ఇప్పుడు కలకత్తా మనదేశంలోకంతా పెద్ద నగరం. ఎంత పెద్దదంటే, రెండు మద్రాసు నగరాలు కలిస్తే ఎంతో అంతది. కలకత్తా నగరంలో మార్కెట్లు, వీధులు భవనాలు చాలా పెద్దవి. అవన్ని చూడాలంటే మోటారులో వెళ్ళి చూడవలసిందే!

ఇక్కడకూడా ''జూ'' అనేదుంది. చిన్నపిల్లలక్కడికెళ్లారంటే ఏనుగులమీద కూర్చోబెట్టి తమాషాగా తిప్పుతారు. ఆఏనుగులు పిల్లల్ని ఏంచెయ్యవు!

కలకత్తా పక్కనే హుగ్లీనది పారుతూంది తెలుసుగదూ! ఆ నదికి రెండువైపులా వూరుంది. ఒక వైపునుంచి మరొక వైపుకెళ్లాలంటే నదిని దాటాలి. అందువల్ల ఆ నదిమీద పెద్ద వంతెన కట్టారు. దానిపేరు ''హౌరా

వంతెన'' ఆ వంతెనమీాద మనుష్యులు, ట్రాములు మోటార్లు పోతాయి. క్రిందనదిలో స్టీమర్లు పోతూంటాయి. ఈ నదివద్దనే చాలా మిల్లులున్నాయి. వాటిలో మనం రాసుకోటానికి తెల్లకాగితాలు, బియ్యం చక్కెర లాంటివి పోసుకోడానికి గోనెసంచులు తయారుచేస్తారు.

కలకత్తాలో సముద్రం కనిపించదు. ఎందుకంటే కలకత్తాకు సముద్రం 80 మైళ్ల దూరానుంది. అందుచేత స్టీమర్లు హుగ్లీ నదిమీాద కలకత్తావరకు వస్తాయి.

హుగ్లీనది వద్దనే చాలా పెద్ద మైదానంవుంది. అక్కడ ఫుట్‌బాలు, హాకీ ఆటలు ఆడుతూంటారు. అక్కడనే విక్టోరియా భవనముంది. దానిలో విక్టోరియా రాణి బొమ్మలు ఆమె తొడుక్కున్న గౌనులు, జాబులు రాసుకొన్న మేజాలు వుంచారు.

కలకత్తాలో ఒకచోట చిన్న చిన్న చెరువు లున్నాయి. ఆ చెరువులదగ్గరే చిన్నపిల్లలు ఆడుకునే చోటుంది. అక్కడే చిన్న పిల్లలు వూగటానికి వుయ్యాలలున్నాయి. అక్కడక్కడ నీళ్లు ఎత్తునుంచి క్రిందపడుతూంటవి. లోతులేని చిన్నచిన్న గుంటలు కూడా వున్నాయక్కడ. వాటిలో కుర్రవాళ్లు చేపల్లాగా ఈదులాడుతూంటారు. అక్కడికి చాలా మంది పిల్లలు వస్తారు.

కలకత్తా నగరంలో దేవాలయాలు చాలా వున్నవి. అయితే ముఖ్యమైన వేమిటో తెలుసా? జైన దేవాలయము, కాళీఘట్ట దేవాలయము. జైన దేవాలయం జైన మతస్థులది. అద్దాలలో తెల్లరాళ్లతో దీన్ని అలంకరించారు. ఈ గుడిచుట్టు మంచి పూలతోటలు, తామరకొలనులు వున్నాయి.

కాళీఘట్టంలో కాళికాదేవాలయం వుంది తెలుసా! దాన్నే కాళీఘట్ట దేవాలయ మంటారు. కలకత్తాకు వెళ్ళినవారందరు ఈ గుడికెళ్లి కాళికాదేవిని పూజిస్తారు. ప్రతి సంవత్సరం దసరా పండుగల్లో కలకత్తాలో వాళ్లు కాళికాదేవికి వుత్సవం చేస్తారు. ఆవుత్సవంచూడాలని చాలావూళ్లనించి కొన్ని లక్షలమంది వస్తారు.

నువ్వు పెద్దవాడివైతే తప్పక కలకత్తావెళ్ళి అన్ని చూచిరా.

# గొలుసు మాటలు

## పుష్పం పుష్పం

ఏమి పుష్పం ?
పరిమళ పుష్పం
ఏమి పరిమళం ?
గంధ పరిమళం
ఏమి గంధం ?
వీర గంధం
ఏమి వీర ?
కురు వీర
ఏమి కురు ?
ధర్మం కురు
ఏమి ధర్మం ?
శాంతి ధర్మం
ఏమి శాంతి ?
అహింసా శాంతి
ఏమి అహింస ?
సత్యా హింస
ఏమి సత్యం ?
దేవుడు సత్యం
ఏమి దేవుడు ?
గాంధి దేవుడు.

రచన : ఊటుకూరి సుహాసి
(బాపట్ల)

## కాళిదాసు - భోజరాజు

(సంవాదన)

భోజరాజు ప్రశ్న : కాళిదాసు సమాధానం

### రాజ స్వస్థి

కిమ్ స్వస్థి? - దేశ స్వస్థి
కిమ్ దేశ ? - మశ్ఛ దేశ
కిమ్ మశ్ఛ ? - జల మశ్ఛ
కిమ్ జల ? - మేఘ జల
కిమ్ మేఘ ? - కాల మేఘ
కిమ్ కాల ? - శీత కాల
కిమ్ శీత ? - రామ సీత
కిమ్ రామ ? - పరశు రామ
కిమ్ పరశు ? - ధేను పరశు
కిమ్ ధేను ? - కామధేను
కిమ్ కామ : - మదన కామ
కిమ్ మదన ? - రాజ మదన
కిమ్ రాజ ? - భోజరాజ

సంపాదన : కె. జి. కృష్ణమూర్తి
(అగళి)

## యల్లమ్మగుడి కాపు

అనగా అనగా ఒకయల్లమ్మ. ఆ యల్లమ్మది ఒకగుడి. ఆ గుడికి ఒకకాపు. ఆ "యల్లమ్మ గుడికాపు" ఒకనాడు అలాగ వెళ్తూవుంటే క్రిందపడి ఏడు ముక్కలయాడు!

ఆ ఏడుముక్కలు తిరిగి చేర్చే సరికి ఒకకూరగాయ అయాడు.

ఆ కూరగాయ ఏమిటి?

" [illegible] "

రచన: యస్. వెంకటాచలం
(విజయనగరం)

---

## వరుస

రేషన్ కార్డుకు వరుస
రైలు టిక్కెట్టుకు వరుస
జైలుదొంగలకు వరుస
డ్రిల్లు క్లాసుకు వరుస
మిల్లు బట్టలకు వరుస
పటాలానికి వరుస
ప్రసాదానికి వరుస
పంక్తి భోజనము వరుస
బస్సు సీటుకు వరుస
ఎఱ్ఱచీమల వరుస
తుఱ్ఱు పిట్టల వరుస

రచన: కె. కె. శాస్త్రి, టీచర్: వారంగల్.


## పిల్లలూ!

మంచి బాగా చేవ్రాత రాస్తే మంచి మార్కులు పరీక్షలో వస్తాయి. జాబ్‌కో ఫౌంట్ ఇంక్ తో రాస్తే ముత్యాల్లాంటి అక్షరాలు వస్తాయి. మీరు హిందూదేశములోని మంచి సిరానే వాడుచున్నారనుకుంటాను. స్వదేశీ సిరా వాడడమే మంచి అలవాటు.




జాబ్‌కో ఫౌంట్ ఇంక్

ఇండియాలో మంచిది.

★

జయభారతం కంపెనీ

మదరాసు - బెంగుళూరు - ఎర్నాకులం.

పిల్లల కొక నాటిక:

# చెవిటి మాలోకం.

"అన్నయ్య"

సుబ్బావధాన్లుకి చెముడు... సుబ్బావధాన్లు భార్య వెంకమ్మకి కూడా చెముడే - ఒకనాడు వాళ్ళింట్లో-

సుబ్బా:- ఔనా! వోయ్! ఎక్కడున్నావ్?... నట్టింట్లోనా?

వెంక:- ఇంట్లో నేవున్నా...ఎందుకలా కేకలేస్తారూ వినిపించనట్టూ!

సు:- అట్లా?...ఏంవట్లు పోస్తున్నావ్?...పెసరట్లా, మినపట్లా?

వెం:- పట్లు దులపలేదండీ!... విసురుతున్నాను.

సుబ్బా:- విసనకర్ర వెతుకుతున్నావా? విసనకర్ర ఇక్కడే వుంది. అక్కడ వెతుకుతావెందుకూ?

వెం:- విందుకా! రావడానికి సిద్ధంగానే వున్నాను. కడియాల వారింట్లో నేనా భోజనం?

సు:- ఏమిటీ! కడియాలు చేయించాలా? లేకపోతే భోంచెయ్యవూ?... ఈ కరువు రోజుల్లో కడియాలెందుకే - నీకు అందెలు వున్నాయిగా!

వెం:- ఏవన్నారూ! అందాలా? నా అందాన్ని మీరు చెప్పి పాడవఖ్ఖర్లేదు. చచ్చు అందం.

సు:- ఏమిటీ! చచ్చిపోతావా చేయించకపోతే! ఒద్దు! ఒద్దు!

వెం:- నా కఖ్ఖర్లేదు లెండి - మీరే ఆ విందు కెళ్ళండి - మీరేతినండి ఆపిండివంటలు!

సుబ్బా:- ఏమిటీ- మంటలో పడిపోతావా!—పోనీలే కడియాలు చేయిస్తాలే. చూడు! ఈ రోజుల్లో వెండి చాలా ప్రియం. కంసాలివాళ్లు మన్ని మోసగించి గోతులో తోస్తారు.

వెం:- ఏమిటీ! నన్ను గోతులో తోస్తారా?—నేనేం పాపం చేశాను? కడియాలవారు విందుకి పిలుస్తే వెళ్దాం అన్నాను. అదొక తప్పా!

సు:- కప్పా? కప్పెందుకే నీకు? కావలిస్తే వెండిపళ్లెం చేయుంచుకో.

వెం:- ఏమిటీ? కళ్లెం కడతారా? నా ఖర్మం కాలా! నేను గుఱ్ఱాన్నా! గాడిదనా!

సుబ్బా:- నన్ను గాడిదంటావా భడవా! ఛీఛీఛీ - ఇటువంటి ఇంట్లో వుండకూడదు— నేనిప్పుడే పోతాను!

వెం:-అయితే కడియాల వారింటి విందు సంగతేంచేశారు?

సు:- నన్ను గాడిదని నీకు ఇంకా కడియాలుకూడానా? ఫో!ఫో!

వెం:- సరే-నేను విందుకివెళ్తాను మీరు తొరగరారండి.

* * *

[సుబ్బావధాన్లుకి కోపంవచ్చి ఊరవతల తోటలో కూర్చొని వుంటాడు...ఇంతలో అక్కడికి ఒక గొల్లవాడు వస్తాడు వాడికి కూడా చెముడే.]

గొల్ల:- బాబయ్యా!అగ్గిపుల్లుందా మీకాడ?

సు:- ఏమిటీ-అగ్గి పెడతావా?

గొ:- అగ్గిపుల్ల బాబయ్యా.

సు:- నాకు పిల్లలు లేరు.

గొ:- అగ్గిపుల్లుంతే ఇప్పించండి బాబయ్యా వెలిగించాలి నా చుట్ట.

సు:- నువ్వు నాచుట్టానివా? నీకు నేను పిల్లనియ్యాలా! చాలు చాలు ఫో-ఫో.

గొ:- పొగాకు కావాలి బాబూ మీకు! మా ఇంటికొస్తే కావలసినంత!

సు:- వింతా? నన్ను చూస్తే నీకు వింతగావుందా! మా ఆవిడకి నాకు మధ్యజరిగిన కడియాల సంగతి నీకెలా తెలిసిందీ?

గొ:- ఓ! గడియారం సంగతి నాకు తెల్సు బాబూ-టింగ్ టింగ్‌మని గంటలు కొడ్తాది అది కాదు బాబూ?

సు:- అవున్రా! నన్ను కొడ్తా నంది. గాడిదంది. నానా మాటలూ ఆడింది.

గొ:- ఆడడం కూడా తెలుసు బాబూ. గడియారంలో ఒక బిళ్ళవుంటాది. అది టిక్ టిక్ మని ఇటూ అటూ ఊగు తాది. మరి నాచుట్టపీక సంగ తేం చేశారు బాబూ!

సు:- నీ చుట్టరికం మండిపోను! నువ్వు నాకేం చుట్టానివిరా? రామ రామ!

భజగోవిందం భజగోవిందం
గోవిందం భజ మూఢమతే!

గొ:- ఏటి బాబూ! నన్నేదో తిడుతుండారే!

సు:- నేనేవీ తినలేదురా! శ్లోకం వల్లించుకుంటున్నాను.

గొ:- మీ శోకం నాకెందుకు బాబూ! ఒక అగ్గిపుల్ల దయ చెయ్యండి.

సు:- దయా? దేనికి దయ? నన్ను దయతో చూచినవారు ఒక్కరూ లేరుకదా! ఆఖరికి నా భార్యకూడా నాకు శత్రువే. అడిగిన నగలు చేయిస్తే మంచి వాణ్ణి_లేకపోతే కోపాలు!

గొ:- ఓహో! పాలు కావాలి బాబయ్యా! మా మందలోకి వస్తే కావలసినన్ని పాలు!

సు:- ఏమిటీ! మీ మంద నేను కాయాలా? చాలా గడుసు వాడిలాగున్నావే!

గొ:- జడుసుకోవు బాబయ్యా! ఆవులన్నీ చాలామంచివి.

సు:- నా మంచి చెడ్డల గురించి నీకెందుకురా! పోయి నీప నేదో చూచుకో!

గొల్ల:- అలాగే బాబయ్యా చూడండి- అల్లదుగో ఆపళ్ళ తోటకాడున్నాయి రండి.

సు:- ఏమిటీ! వల్లకాడికి రమ్మంటావా? ఛీ! ఛో!

గొ:- ఇదేటి బాబయ్యా! పాలిస్తాను రమ్మంటే ఛీ ఛో అంతారు. నేను చేసిన ద్రోహం ఏటండీ

సు:- నన్ను ద్రోహి అంటావా? నేను మా ఆవిడని "కడియాలొద్దూ, అందెలు వున్నాయిగా"అన్నాను. అంటే ద్రోహమా!...పోనీ, ఒరే, ఓమాట చెప్తాను చేస్తావూ?

గో:- చెప్పండి బాబయ్యా చేత్తాను.

సు:- నువ్వు మా ఇంటి కెళ్ళాలి.

గో:- ఏటి బాబూ! ఇటికలు తేవాలా?

సు:- (గట్టిగా) ఇటికలు కావురా! మా ఇంటికి వెళ్ళి మా ఆవిడతో ఒక సంగతి చెప్పాలి.

గో:- సంగీతం చెప్పాలా బాబూ?

సు:- ఆ! ఆ సంగతి ఏమిటంటే ఇలా మీ ఆయన ఊరిబైట తోటలో నిద్రాహారాలు లేకుండా వున్నారు - వెంటనే రమ్మని—చెప్పాలి.

గో:- అలాగే బాబూ! నాకు సంగీతం అంతా వచ్చును. ఇప్పుడే వెళ్తా బాబూ! అగ్గిపుల్ల సంగతి మరచి పోకూడదు.

సు:- అలాగేరా! నీకో మంచి పిల్లని చూసి పెళ్ళిచేస్తాలే.

---

[గొల్ల వెంకడు, సుబ్బావధాన్లు ఇంటికి వచ్చేడు. ఈ లోపుగా వెంకమ్మ కడియాలవారింటికి విందుకెళ్ళి తిరిగి వచ్చింది.]

గో:- అమ్మగోరూ! వెంకమ్మగోరూ!

వెం:- ఎవరదీ?

గో:- నేనమ్మా గొల్లోడ్ని.

వెం:- ఎవరి పిల్లోడివి?

గో:- అగ్గిపుల్ల గొల్లోడ్నమ్మగారు-తలుపు తియ్యండి.

(తలుపు తీయును)

వెం:- అరె! గొల్లవాడు! ఎవరో పిల్లవాడనుకున్నాను. ఏంఅబ్బీ ఎందుకొచ్చావు.

గో:- మీకు సంగీతం చెప్పడానికొచ్చినానమ్మా.

వెం:- సగం జీతవా!...నీకు మేం జీతం ఎందుకియ్యాలీ!

గో:- అయ్యవారు చెప్పినారు!

వెం:- అయ్యవారా? ఏరీ అయ్యవారు?

గో:- తోటకాడున్నారు.

వెం:- ఏమిటీ? తోటకూర తెమ్మన్నారా? తోటకూరెందుకూ?

గో:- అదేమో నాకు తెల్దమ్మా తమకి సంగీతం—

వెం:- నీకు జీతం ఏమిటిరా!

నువ్వెవడో దొంగవాడిలాగు న్నావు ఫో!

గొ:- అదేటమ్మా! అయ్యవారు పంపిస్తేనే!

వెం:- చంపేశారా?...ఎవర్ని! అయ్యో! అయ్యో! (ఏడుపు)

గొ:- ఎందుకమ్మా అలా ఏడుస్తారు-

వెం:- ఇదుగో-నువ్వెళ్ళి ఆఅయ్యవారిని వేగం ఇంటికిరమ్మను. కడియాలవారింట్లో విందయిపోయి -అందరూ వెళిపోయారని చెప్పు. వారిని అక్కడికి వెళ్ళక ఇక్కడికి రమ్మని చెప్పు—పో!

గొ:- అయితే అమ్మా సంగీతం?

వెం: జీతం ఏమిటిరా! ఆ జీతం ఏదో అయ్యవారినే అడుగు. ఇంద యీ సొమ్ము తీసుకొని తొరగా ఫో!

* * *

[గొల్లవాడు తిరిగి తోటలోనికి వచ్చాడు.]

సు:-ఏఁవిరా గొల్లా! చెప్పావా?

గొ:- బాబయ్యా! అమ్మగోరుకి సంగీతం చెప్తానంటే ఏడిసినారు!

సు:- ఏడ్చిందా? ఎందుకూ?

గొ:- ఎక్కడో పెళ్ళివారంతా పోయారట!

సు:- ఆ! పోయారా? అయ్యో పాపం-ఏం జబ్బువచ్చిందో?

గొ:- డబ్బా! ఇదుగో యీడబ్బు ఇచ్చారు. తమర్ని వేగంగా రమ్మన్నారు.

సు:- ఓహో! కడియాలు కొనమని డబ్బిచ్చిందా? ఏదీ ఇలాతే!

గొ:- ఆఁ!- అమ్మగోరు నాకిచ్చినారు మీకెందు కిస్తాను?

సు:- ఆడబ్బుతో కడియాలు కొనాలిరా!

గొ:- ఏటి బాబూ గడియారం కొంటారా? నాకు గడియారం ఒద్దు బాబూ!—నా చుట్టకి అగ్గిపుల్లిస్తే చాలు బాబూ!

సు:- ఓహో! నీకు పిల్లనిచ్చి చుట్టరికం కలుపుకోవాలా! చూడు నిన్నేం చేస్తానో! పోలీసుతో చెప్పి నీకు తగిన శాస్తి పెడతా!

గొ:- తమ ఆస్తికూడా ఇస్తారా బాబూ! తమ ఆస్తి నాకెందుకు బాబూ-ఒద్దు ఒద్దు.

సు :- ఒద్దంటే వూరుకుంటానా? ఇప్పుడే పోలీసుతో చెప్తాను.

......

[పోలీసుస్టేషను దగ్గర]

సు :-ఏవండోయ్! పోలీసుగారు! చూశారా వీడు మా డబ్బు తీసుకున్నాడు.

పోలీసు :- ఏం గొల్లవాడా! అవధాన్లుగారిడబ్బుతీసుకున్నావా?

గొ :- వారిజబ్బు నాకెందుకు బాబు - నా జబ్బుతో నేను బాధపడుతుంటే-

పో :- జబ్బుకాదురా డబ్బు!

గొ :- మేం డప్పులు వాయించే వాళ్లంకాం బాబయ్యా! గొల్లవాళ్లం.

పో :- ఇదెక్కడి చెవిటిగోలొచ్చిందే! ఏవండీఅవధాన్లుగారు వాడికేమీ తెలియనట్టుందే. పిచ్చివాడులాగున్నాడు.

అవ :- నేను పిచ్చివాణ్నా! నా భార్య కడియాలు చేయించమని వీడిచేతికి డబ్బిస్తే అది దాచేసి మోసంచేస్తున్నాడు.

పో :- ఏవిరా గొల్లోడా! ఏవిటంటావు?

గొ :- అయ్యవోరిని ఎట్టగ్గిపుల్లిమ్మంటే—

పో :- ఛాప్! నోరుముయ్యి!

గొ :-ఎవరినోరుమూసేదిబాబూ.

పో :- అధిక ప్రసంగం చేయకు. నీ దగ్గరున్నరూపాయిలియ్యి.

గొ :- ఉల్లిపాయలా? అవెక్కడినుంచి తెచ్చేది బాబూ?

పో :- చచ్చామురా దేముడా! ఇద్దరూ చెవిటివాళ్లే - వీళ్ల తగువు ఇలా తీరదు - రండి - అందరూ అవధాన్లుగారింటికి వెళ్దాం.

[అవధాన్లుగారింటిదగ్గర]

అవ :- ఏవండోయ్! పోలీసుగారు! మీరే నన్ను రక్షించాలి. మా ఆవిడ కడియాలు తేకపోతే నన్ను ఇంట్లోంచి తరుముతుంది.

గొ :- బాబోయ్! పోలీసుగారూ! అమ్మగోరుకి సంగీతం సెప్పమని సెలవా?

పో :-నువ్వూరుకో! మాట్లాడకు- ఏమండీ! అమ్మగారూ! ఏమిటి యీ ఫిర్యాదు?

వెంకమ్మ :- అయ్యో! బాబూ! మాఆయన ఎవర్నీ చంపలేదు బాబూ! వారిని క్షమించండి.

పో :- ఎవరన్నారు? చంపేడని. ఆయనేమీ నేరంచేయలేదే!

వెం :- బేరంచేయడం ఏఁవిటండీ?

పో :- ఓహో! ఈమెకుకూడా చెముడు గాబోలు!

గో :- బాబయ్యా! సంగీతం చెప్పమంటారా?

వెం :- సగం జీతం ఇచ్చేనుగా! ఏవండీ వీడికి మనం జీతం ఇయ్యాలా?

అవ :-నా కేసంగతీ తెలీదే! నీ కిష్టంఒచ్చిన నగలు చేయించుకోమని వాడితో కబురు పంపేను.

వెం :- ఇప్పుడు కబుర్లెందుకండి. ముందు ఆ పోలీసాయన్ని పంపించీండి.

పో :- భేష్! ఇదంతా ఒక చెవిటి గోలగా వుంది. ఒకరిమాట ఒకరికి పొందదు. అంతా చెవిటి మాలోకం. నేనిక పోతాను. (పోలీసు వెళిపోతాడు)

గో :- బాబయ్యా! నాకు మందకి వేళయింది. నేనుకూడా పోతాను. రేపొచ్చి సంగీతం-

వెం :- నీ జీతం ఇచ్చేనుగా! ఇంకపో-

(గొల్లవాడు వెళిపోతాడు)

హమ్మయ్య! రండి భోజనానికి. పాపం ఆకలితో వున్నారు.

అవ :- పద—

(తెర)




పండిత్.డి.గోపాలాచార్యులవారి

అరుణ

గర్భాశయరోగ నివారిణి.




అరుణ ఋతుదోషములను పోగొట్టి, పరిపూర్ణ స్త్రీత్వమును ప్రసాదించగల స్వయం సంపూర్ణమగు ఔషధము. అట్టిదానిని విడువక సేవించినట్లయితే, మిము: ఆరోగ్యవంతులను జేయుటయేగాక, మీ జీవన పరమావధియగు అమందానందమును తప్పక యొసగును.

ఆయుర్వేదాశ్రమం,లిమిటెడ్

టి-నగర్. . . . మద్రాసు.

EASTERNS 378.

# బాలలో ఉన్నవే!

ఈచదరంలో బాలలో మీరు తరచూ చూచేవే వున్నాయి. అయిదో వరసలోని "మం" దగ్గర ప్రారంభించి, ఆ వాక్యమును చదవగలవా?

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| డు | పౌ | ద | డ | క్షు | చి | ప్ర | క్షు |
| పు | టి | యు | వి | లు | లు | శ్నే | చి |
| క | థ | లు | చి | క్షు | క | థ | లు |
| బా | లు | ము | స | వ్యా | క | చి | మం |
| మ్మ | ల | ప | న | లు | థ | ము | చి |
| లు | ము | ధ్య | చ | ర | లు | ను | డు |
| బా | క | థ | ధ | ల | వి | బా | డం |
| మ్మ | ల | లు | మొ | గు | న | ల | లూ |



కూర్పు: యం. వి. జోగారావు.

# ఇంట్లో .... బళ్లో ....

రచన : తుమ్మలపల్లి అంజన్‌కుమార్ (5-వ తరగతి)

భూమి నారింజ పండువలె గుండ్రముగా నుండును అని మా మేష్టారు చెప్పిన జాగ్రఫీపాఠం చదువుతున్నా. మా నాన్న అది విని 'ఛా ! వెధవా ! భూమి గుండ్రంగావుంటుదటరా! అట్లావుంటే ఈ ఇళ్లు, ఈ రోడ్లు, ఈ మనుష్యులు దొర్లిపోకుండా ఎట్లా వుంటారు ? భూమి గుండ్రముగా లేదు. అది బల్లపరుపుగానున్నది. తెలిసిందా," అన్నాడు.

"మా మేష్టారు గుండ్రముగా నున్నదని చెప్పారు నాన్నా," అని నేను అన్నా.

"ఛా ! ఆయన చెప్పినది తప్పు" అని మానాన్న అన్నాడు.

మర్నాడు బళ్లో మేష్టారు భూమి ఎట్లావుందిరా అని అడిగారు. మానాన్న చెప్పినమాటలు గుర్తుతెచ్చుకొని "బల్లపరుపుగా వుంటుందండీ" అన్నా. దాంతో ఆయనకు కోపంవచ్చి "గుండ్రంగా ఉందా బల్లపరుపుగా వుందా"-అంటూ నన్ను చావబాదాడు.

"మా నాన్న అట్లా చెప్పేరండీ"

"ఏడిశావులే. నోరుమూసుకో"

........

ఆవేళ రాత్రి ఇంటిదగ్గర చదువుకుంటూవుంటే మానాన్న, "భూమి ఎట్లావుంటుందిరా" అని అడిగాడు మళ్ళీ.

గుండ్రముగా వుంటుందని చెప్పేటప్పటికీ మానాన్న నన్ను చితకపొడిచాడు. దాంతో నాకు పిచ్చిఎత్తినట్లు అయింది. ఆలోచిస్తే మంచి వూహ తట్టింది. అప్పటినుంచి నాన్న అడిగినప్పుడల్లా బల్లపరుపుగా వుంటుంది; మేష్టారు అడిగినప్పుడల్లా గుండ్రముగా వుంటుందని చెప్పటం మొదలుపెట్టేను.

ఇట్లా వుంటూ వుంటే ఒక రోజున మానాన్న నేను ఎట్లా

చదువుచున్నానో కనుక్కుందామని స్కూలుకు వచ్చాడు. అప్పుడు మాకు జాగ్రఫీ క్లాసు. మా మేష్టారు. "భూమి ఎట్లావుంటుందిరా" అని అడిగారు. ఇప్పుడు నాకు బలే చిక్కువచ్చింది! మా నాన్న మా మేష్టారు ఇద్దరూ అప్పుడు అక్కడవున్నారు!

అప్పుడు నాకు అనుమానం వచ్చింది. గుండ్రముగా వుందని చెప్పాలా, బల్లపరుపుగా నున్నదని చెప్పాలా?

ఒక యుక్తి పన్నేను.

"భూమి, మా ఇంట్లో బల్లపరుపుగాను, బళ్లో గుండ్రముగాను వుంటుంది" అన్నాను.

సమాధానం బాగుందా?

---


బాల

సంవత్సరం చందా రూ. 5/-

(ప్రత్యేక సంచికతో సహా)

వి. పి. పద్ధతిలేదు.

అన్నిగ్రామాల్లోను ఏజంట్లు కావలెను.


## బాలకు కొమ్మలు!

ఉదయమె లేచుట
నేర్చుకొమ్మ.
కాల కృత్యములు
తీర్చుకొమ్మ.
మంచిదుస్తులను
వేసుకొమ్మ.
హారము మితముగ
తీసుకొమ్మ.
గురువు చెప్పినట్లు
నడచుకొమ్మ.
శ్రద్ధతో పాఠముల్
చదువుకొమ్మ.
సాయంత్రమ్మున
ఆడుకొమ్మ.
తల్లి దండ్రులకు సేవ
చేసుకొమ్మ.
దైవము నెప్పుడు
తలచుకొమ్మ.
బాలను తప్పక
చదువుకొమ్మ.

రచన: కొప్పర్తి రాజగోపాలం,
(టీచరు) అమలాపురం.

బాలలకు బహు మంచి పుస్తకములు

# రాయుల వాచకములు

(1, 2, 3, 4, 5, తరగతులకు)

ఈ క్రింది శతకములు తెల్లని గ్లేజుకాగితమున చక్కని అక్షరములలో ముచ్చటగా ముద్రింపబడినవి. బాలలకొఱకు ప్రత్యేకముగ ప్రచురింపబడినవి.

| | | | |
|---|---|---|---|
| రామరామ శతకము | 0-2-0 | రాయల గణితబోధిని | 0-1-0 |
| నారాయణ శతకము | 0-2-0 | ఆంగ్లో తెలుగు ప్రైమరు | 0-5-0 |
| వేమన శతకము | 0-2-0 | నీతిశాస్త్రము తాత్పర్యము | 0-4-0 |
| సుమతిశతకము | 0-2-0 | డిటో టీకాతాత్పర్యము | 0-4-0 |
| కృష్ణశతకము | 0-2-0 | ,, ,, | 0-4-0 |
| బాలరామాయణము | 0-2-0 | ,, ,, | 0-4-0 |
| దాశరథి శతకము | 0-2-0 | ,, ,, | 0-6-0 |
| భాస్కరశతకము | 0-2-0 | ,, ,, | 0-8-0 |
| నరసింహశతకము | 0-4-0 | ,, ,, | 0-8-0 |
| గజేంద్రమోక్షము | 0-4-0 | ,, ,, | 0-8-0 |
| రుక్మిణీకల్యాణము | 0-4-0 | ,, ,, | 0-8-0 |
| అమరకోశము | 0 4 0 | ,, ,, | 0-8-0 |
| వేమనశతకము | 0- 2-0 | పుష్పగిరి మహాత్మ్యము | 0- 4-0 |
| గృహసరస్వతి (ఇంగ్లీష్అక్షరములు) | 0- 4-0 | ఆంధ్రనామ సంగ్రహము టీకా | 0-10-0 |
| నీతిచంద్రిక శుద్ధప్రతి | 0-10-0 | ప్రియదర్శిని (నవల) | 1- 0-0 |

మద్దులేటి నృసింహ శతకము. (కందపద్యములు పాకెట్ సైజు.) 0–2–0

## రాయలు అండు కో., పబ్లిషర్స్, కడప.

ఈ క్రిందివారివద్దకూడా పై గ్రంథములు దొరకును. కొనునపుడు కడప రాయలు అండు కో వారి ప్రచురణములని అడుగుడు.

మదరాసు:-విజయమారుతి పబ్లిషింగ్ హౌస్,
6, సుంకురామశెట్టి వీధి.
బెంగళూరుదండు:-న్యూ ఆనందా బుక్ డిపో;
2-3 ధర్మరాజు వీధి
హిందూపురము:-కస్తూర్బా స్టోర్స్
అనంతపురము:-B. C. ఆదినారాయణశెట్టి
బళ్లారి :-K. L. బ్రదర్స్
గుంతకల్లు:-కొండా బసన్నశెట్టి
ద్రోణాచలము:-శ్రీ మాణిక్యా స్టోర్స్
కర్నూలు:-వి. రామకృష్ణయ్య
కదిరి:-వంకదార నాగలక్ష్మయ్యశెట్టి

నంద్యాల :-ప్రభాకర అండు కో;
గుంటూరు:-వెంకటేశ్వర అండు కో;
చిత్తూరు :-ది. ఓరియన్టు పబ్లిషింగ్ కంపెని
తిరుపతి :-గోల్డన్ బుక్ డిపో, కాళహస్తి:-
కాళహస్తి:-మారుతి బుక్ డిపో
నెల్లూరు :-V. V. నాయుడు అండు సన్సు
కావలి:-కామేశ్వర బుక్ డిపో;
తెనాలి :-సుందరరాం అండు సన్సు
అనకాపల్లి:-పుప్పల జగ్గారావు & సన్సు
సికింద్రాబాదు :-కొండా వీరయ్య
విజయనగరము:-K. V. సుబ్బారావు & సన్సు



# బాలసేన శంఖారా



బాలుల్లారా
లేవండోయ్,
బాలసేన
స్థాపించండోయ్.
భారతదేశం
మన దేనంటూ,
బాలప్రతాపం
చూపండోయ్.

చూపండోయ్,
చూపండోయ్,
పరాక్రమం
చూపించండోయ్ ॥బా॥

ఆటలలోనూ,
పాటలలోనూ,
అనవసరముగా
కాలం గడుపక,
భరత వీరులై
ప్రకాశించుచూ,
రణరంగములో
నిలువండోయ్.

నిలువండోయ్
నిలువండోయ్.
మన తల్లిని
గెలిపించండోయ్ ॥బా॥

జై హిందంటూ,
'ఢిల్లి చలో' యని,
త్రివర్ణ జండా
చేతనుబూని,
ఢిల్లీకోటకు
నడువండోయ్.

నడువండోయ్,
నడువండోయ్,
దాసిసత్వమును
తుడువండోయ్ ॥బా॥

రచయిత : "సూరిసెట్టన్నాయ్" (అనకాపల్లి)






# అబద్ధాల ఫలం

రాముడూ గోపాలుడూ అన్న దమ్ములు.

రాముడెప్పుడే తప్పుచేసినా తండ్రితోనూ తల్లితోనూ తప్ప కుండా చెప్పేవాడు. అందుచే అత నిమాటలు అందరూ నమ్మేవారు.

గోపాలుడబద్ధాల పుట్ట. ఒక్కరూ అతన్ని నమ్మేవారు కారు. ఏదైనా తప్పుచేస్తే నిజం చెప్పితే కొట్టుతారేమో అని భయపడేవాడు గోపాలుడు.

రాముడట్లాకాదు. చిన్న తప్పు చేసినా ఒప్పుకునేవాడు. ఆ చిన్న చిన్న తప్పుల కాతనితల్లి ఊరు కునేది–గోపాలు డెప్పుడూ దెబ్బలు తినేవాడు.

రచన:
శిష్ట్లా ఉమామహేశ్వరరావ్

ఓరోజున తల్లి పొరుగింటికి పోయిన సమయాన అన్నదమ్ములిద్దరూ ఇంట్లో ఆడుకుంటున్నారు. ఇంట్లో తండ్రికూడా లేదు. బుల్ బుల్ అనే ఒక చక్కని నమ్మకమైన పెంపుడుకుక్క వుంది. దాన్ని చూస్తే అందరికీ ప్రేమే. అందరికీ మచ్చికే.

బుల్ బుల్ కూడా తోక జాడిస్తూ ఆ యిద్దరితో అటూ ఇటూ పరుగెత్తుతూ ఆడుతోంది. ఈ ఆటపాటల్లో బల్లమీద గ్లాసులో పాలున్నాయని వాళ్లు చూడలా. పిల్లల చేతులు తగిలి పాలు వలికిపోయాయి. ఇద్దరికీ ఏమీ తోచలా. కొంచెంసేపు మాటాడలేక చూస్తూ

నుంచున్నారు. బుల్ బుల్ కు అస లేమీ తెలియలా. కొంచెంసేపు గాభరాతో చూచింతర్వాత వలి కినపాలను గతక నారంభించింది. అప్పుడు రాము డన్నాడు :

"ఇవాళ రాత్రి అమ్మ మనకు పెరుగుపొయ్యదు"

"ఆఁ! ఎందుకనీ? ఇంట్లో ఇంక పాలే లేవా?" అన్నాడు గోపాలుడు.

"అమ్మ అలవాటు నీకు తెలీదూ? మన మేదైనా తప్పుచేస్తే మళ్ళీ చెయ్యకుండా ఏదైనా ఓ శిక్ష వేస్తుంది!!

ఇంట్లో ఆడుకుంటుంటే ఇంకా యేమి వలుకుతాయోఅని ఇద్దరు దొడ్లోకుపోయి మూలన బావి ప్రక్కనే ఆడుకుంటున్నారు. ఇంతలో వాళ్లమ్మవచ్చి ఇంట్లో ఏదో పని చేసుకుంటోంది. అది చూచారు ఇద్దరూ. రాముడన్నాడు: "దా గోపాలా! అమ్మదగ్గరకు పోయి నిజం ఒప్పుకుందాం!"

"ఆ కాసేపుండరా వెళ్దాం" అన్నాడు గోపాలుడు.

"కాదు వెంటనే వెళ్దాం. లేకపోతే ఆపని కుక్క చేసిందని దాన్ని కొట్టుతుందేమో అమ్మ!"

"అయితే నువ్వుపో లే; నే నిప్పుడేవస్తా"

రాము డింట్లోకి పోయాడు. వాళ్లమ్మ మేడమీదికి పోయిందని గ్రహించక మళ్ళీ పక్కింటికి పోయిందనుకుని అటు పోయాడు.

గోపాలు డింతలో లోపలి కొచ్చాడు. వాళ్లమ్మ మేడమెట్లు దిగుతూనే "ఏమిరా పాలు వలకపోసిందెవరూ నిజం చెప్పూ!" అన్నది.

"మే మెవ్వరమూ కాదే అమ్మా. మాతోకూడా ఆడుకుంటూ బుల్ బుల్ ఎగిరి బల్లను తన్నింది. పాలు వలికాయి."

"ఆహాఁ! అయితే బయటకు పోయి వేపబెత్త మొకటి పట్టుకునిరా. బుల్ బుల్ కు మరీ వచ్చిందే!"

గోపాలుడు బయటకు పోయి బెత్తం పుచ్చుకొని వస్తుంటే పక్కింటినుంచి రాముడొస్తు

న్నాడు. అతన్ని చూచి! "ఒరేయి పాలు బుల్ బుల్ వలకపోసిం దన్నాను గాని నీవేమీ మాటా డకు!" అన్నాడు గోపాలుడు.

"ఛీ! మనతప్పు పాపం బుల్ బుల్ మీాద పెట్టడమా! నేపోయి నిజం చెప్తా" అన్నాడు రాముడు.

గోపాలునికి బెదరుపుట్టి ముందరిస్తుగా పరుగెత్తుకు పోయాడు. లోపలికి పోతూనే తలుపు గడి యేసుకుని తల్లికి బెత్తమిచ్చాడు.

ఎందుకా వాడట్లా పరుగెత్తుకు పోయాడని అర్థమవక రాముడు మెల్లిగా ఇంటికెళ్లాడు. తలుపు వేసుంది. ఇంట్లో ఛళ్ మని కుక్క మీాద దెబ్బపడ్డది. కెవ్వుమని కుక్క ఏడ్చింది.

రాముడు గ్రహించాడు. తలుపుమీాద దబదబా కొట్టాడు. ఏమిటాచప్పుడని వాళ్లమ్మ తలుపు తీసింది. రాముడన్నాడు: బుల్ బుల్ నెందుకే కొట్టడం పాపం! పాలు వలకపోసింది మేమైతే!"

ఇంతలో వాళ్ల నాయ నొచ్చాడు. 'ఏమిటీ గోలంతా!' అన్నాడు. వాళ్లమ్మ జరిగిందంతా చెప్పింది.

"నాన్నా నాన్నా నేనింక బద్ద మాడను" అన్నాడు గోపాలుడు.

"ఎన్నిసార్లైందరా యిట్లా? ఒసే ఆ బెత్తమిడిదే!" అన్నాడు వాళ్ళ నాన్న. అంటూ "బుల్ బుల్ను ఎన్ని దెబ్బలు కొట్టావ్?" అని అడిగాడు.

"ఒక్కటే లేండి!" అంటూ చేతికి బెత్తం ఇచ్చింది ఆవిడ.

గోపాలుడ్ని తండ్రి ఒకటికి నాలుగు ఉతికాడు. రాముడ్ని చూచి "అబ్బాయికి రాత్రి పెరుగువెయ్యడం మానవాకు. గోపాలునికి మాత్రం నాలుగు రోజులు వరుసగా వెయ్యవాకు!" అన్నాడు.

తోక జాడించుకుంటూ బుల్ బుల్ రాముడి కాళ్లసందున దూరింది. అదిచూచి: 'రాము డూ, బుల్ బుల్ను నీకిచ్చేస్తున్నా. ఇకనుంచీ అది నీదే. జాగ్రత్తగా పెంచు. రేపే కొత్తగొలుసొకటి కూడా కొనిపెట్టుతాలే' అన్నాడు.

బుల్ బుల్ కు సంతోషం వేసింది. బౌబౌ అని అరచి రాముని కాళ్లముందరనుంచుంది.

# మానాన్న 8 చిలుకలు చంపాడు!

రచన: కొత్ర సుబ్బలక్ష్మి (ఓరుగల్లు)

మా ఇంట్లో అందరికీ కాఫీ త్రాగడం బాగా అలవాటు. ఆనాడు చక్కెర కొనడానికి నేను రేషను షాపుకి వెళ్లాను. ఆ వారం మాకు చక్కెర దొరకలేదు. ఇంటికివచ్చి మా నాన్నతో చెప్పాను. "పోనీలే అమ్మా" అన్నారు మానాన్న. వెంటనే సంచీ పట్టుకొని బజారు కెళ్లారు. ఏవో కొనితెచ్చారు. ఆ మర్నాడు పొద్దున్నే మా అమ్మ కాఫీ తయారుచేసింది. పంచదారో? మానాన్న వెంటనే సంచీలోంచి ఎనిమిది చిలకల్ని తీసి వేడికాఫీలో పడేశారు!

"అదేమిటి నాన్నా! చిలకల్ని చంపుతున్నారు!" అన్నాడు మా తమ్ముడు.

"ఇవి పంచదార చిలకలమ్మా!"-అన్నారు మానాన్న.


## ఎలుకబోను!



ఈ ఎలుకబోనులో ఎలుక పడింది. పాపం!...పైకివస్తే పిల్లి చంపేస్తుందేమో! అయినా భయంలేదు. అది అసలు ఎలుక కాదు...వెండి ఎలుక! వెండి బోనులో పడింది.

ఇంత చక్కని వెండి ఆటవస్తువులు, ఇంత నాజూకుగా ఎవరు తయారుచేస్తారో తెలుసా?

టి. మాణిక్యం చెట్టి,

6- గోవిందప్పనాయక వీధి, జి. టి. మదరాసు.

# వాన మబ్బు

అనువాదం :
దేశిరాట్ - సి - రాట్


క్రిందికి దిగు, క్రిందికి దిగు, నల్ల మేఘమా
పువ్వులు మోసే మేఘమ! క్రిందికి దిగు, దిగిరమ్మా
దూదివంటి మేఘమా! ధూళివంటి మేఘమా
నీ చెమటను క్రింద రాల్చుమా.

రమ్ము గ్రుడ్డి మేఘమా!...రమ్ము గ్రుడ్డి మేఘమా
నీ పదునిద్దరు చిరుమబ్బుల తమ్ముల తోడ్కొని రా...
ఇన్ని నీళ్లు రాల్చు మేము సన్నని వరి అన్నము మరి
అన్నయ్యలతో తినగా—
ఇన్ని నీళ్లు రాల్చు నీవు
వాన మేఘమా—

తిన్నని మబ్బా!...చిన్నరి మబ్బా!
బలమగు మబ్బా!...బద్దకిష్టి మబ్బా!
నా ముక్కరలో వజ్రపు రాయి అమ్మి, నీతలకై
అడుగు పొడుగు, కులుకు చిలుకు, గొడుగును కొంటా.
చల్లని వానా!...మెల్లని సోనా!

మూలను పడవేశాం, మేం ముద్దు నాగలీ,
ఎండలోన మండిపోవు రైతు కోమలీ
ఓ వానా! నవ్వుతూను, రావే వానా!

[మినూమసానీ వ్రాసిన
'అవర్ ఇండియా' నుండి]




# హరివిల్లు

**1**

నీలాల నింగిలో
నిగనిగల కాంతితో
రంగురంగుల విల్లు
రమ్యంబుగా పొడిచె॥

**2**

ఈవిల్లె హరివిల్లు
ఇంద్ర ధనువంటారు
కవులెల్ల దానిపై
కవిత సెబుతుంటారు॥

**3**

దూదిపింజల్లాటి
మేఘాలు చీల్చుకొని
ఏడురంగుల విల్లు
ఏపుగా పొడిచింది॥

**4**

ముత్యాల వర్షంబు
ముందుగా కట్టేసి
చిరునవ్వుతో విల్లు
చిందులాడుచువచ్చె॥

**5**

హరివిల్లు పొడిచింది
వర్షాలు పడవంట
యీర్ష్యతో కర్షకులు
ఎదురు చూస్తుంటారు॥

**6**

వన్నె వన్నెలరంగు
వెలసిపోతున్నాది
కిరణాలలో విల్లు
కలసిపోతున్నాది॥

రచన ; ఘండికోట నరసింహామూర్తి
టీచర్ (ఆముదాలవలస)

# చుక్కల కథ

రచన: గొబ్బూరు వెంకటానంద రాఘవరావు

చుక్కల్లారా! చుక్కల్లారా!

చక్కటి చినచిన చుక్కల్లారా!

పగలల్లా మీ రెక్కడ వుందురో?

పొద్దటు పోయిన పిమ్మట మీరూ

ముత్యాలల్లే మిలమిల లాడుతు

వజ్రప్పొళ్లలె తళతళ లాడుతు

ఆకాశమంతా అలుముకు వస్తారు.

ఎవరమ్మా? మీ రేమిటి సంగతి?

చెప్పండమ్మా - చెప్పండి.

# సప్తమహాఋషులు


ఆకాశం మీద రాత్రి మిణుకుమిణుకు మంటూ లెక్కలేనన్ని చుక్కల్ని, అంటే నక్షత్రాలను చూస్తాం: ఈ నక్షత్రాలు ఏమిటి? అవి అక్కడ ఎలాగున్నాయి? అని చాలామంది ఆశ్చర్యపోతూ వుంటారు.

మన పూర్వులు, వాళ్లపుస్తకాల్లో యీ నక్షత్రాల గురించి వ్రాశారు. అందులో కొన్నికొన్ని పెద్దనక్షత్రాలు గొప్పగొప్ప మహాఋషులని రాశారు. మన భూలోకంలో గొప్ప కీర్తి పొందిన వాళ్లు ఆకాశంమీద నక్షత్రాలవుతారని అంటారు.

ధ్రువుడు కథ మీరు వినేవుంటారు. ఆ ధ్రువుడు ఇప్పుడు ఆకాశంమీద ఒక పెద్ద నక్షత్రంగా ప్రకాశిస్తున్నాడు.

మీరు తెల్లవారగట్లలేచి, పొద్దు పొడవకముందు ఉత్తర దిక్కున ఆకాశంవైపు చూడండి. పెద్ద నక్షత్రం జిగజిగమెరుస్తూ కనబడుతుంది. ఆ నక్షత్రమే ధ్రువుడు. ఇంకా కొంచెం పైకిచూస్తే మీకు ఏడు చుక్కలు కనబడతవి. ఆ నక్షత్రాలే సప్తమహాఋషులు. వాళ్లపేర్లు: కశ్యపుడు, అత్రి, భరద్వాజుడు, విశ్వామిత్రుడు, గౌతముడు, వశిష్ఠుడు, జమదగ్ని.

ఈ క్రింది బొమ్మలో ఆ ఏడుగురు ఋషులు ఎక్కడెక్కడున్నారో చూడండి. 1, 2, 3, 4 అంకెల చుక్కలు నాలుగూ చతురస్రంవలె ఉంటవి. 5, 6, 7 అంకెల చుక్కలు వంకరగా



తోకవలె వుంటవి. 6 రో అంకెదగ్గర మిణుకు మిణుకు మంటూ ఒక చిన్న చుక్క కనబడుతుంది. ఆమె పేరు అరుంధతి. పెళ్లినాటి రాత్రి యీ అరుంధతి నక్షత్రాన్నే వధూవరులు చూస్తారు.

మీరు 1, 2 చుక్కల మీదుగా తిన్నగా ఒకసరరేఖ గీస్తే, ఆరేఖ ధ్రువుడుమీదుగా పోతుంది. 1, 2 చుక్కల మధ్య దూరమునకు సుమారు నాలుగు రెట్ల దూరములో ధ్రువుడు ఎల్లప్పుడూ ఒక చోటే వున్నట్లు కనబడతాడు. సప్తఋషులు, తక్కిన చుక్కలూ ధ్రువునిచుట్టూ ప్రదక్షిణము చేస్తున్నట్లు కనబడతారు.

ఈ చుక్కల గురించి ఇంకా ఎన్నో కధలున్నాయి.

శ్రీ కవల ఫిలిమ్సు వారి

★ "బాపూజి" ★

(తెలుగు)

తారాగణం: Ch. నారాయణరావు, శ్రీరంజిని (జూనియర్)

మొదలగు సుప్రసిద్ధ తారాగణంతో........

కవి: బి. టి. నరసింహాచారి

మ్యూజిక్: దినకర్ & హనుమంతరావు

కథ, డైరక్షన్: కవల ప్రకాష్

సూపర్‌విషన్, ఎడిటింగ్: డి. ఆర్. బరోద్కర్, (బొంబాయి)

అసోసియేటు: బి. వరహాలరాజు, బి. ఎ.

అసిస్టెంటు డైరక్షన్: వి. రామశర్మ బి. ఎ., వి. ఎన్. రావు.

Particulars:

SRI KAVALA FILMS

Subhadrabai Mansions, General Patters Road.

MOUNT ROAD •• MADRAS.

మీ బిడ్డ లివర్ అండ్ స్ప్లీను వ్యాధిచే

బాధపడుచున్నయెడల వెంటనే

పాత్రుడు గారి

బాల సంజీవిని

యీయండి

ఇతర మందులన్నిటికన్న ఇది ప్రశస్తమని మీకే తెలియగలదు.

వివరములకు :—

డా॥ పిళ్లా పాపయ్యా పాత్రుడు & బ్రదరు,

11. దక్షిణమాడావీధి, మైలాపూరు, మదరాసు.

కుంభకోణం బ్రాంచి: నెం. 7, సారంగపాణి కోవిల్, తూర్పువీధి.

తిరుచినాపల్లి బ్రాంచి: నెం. 15, పుగళైపిళ్ళె వీధి, తెప్పకొలం.

# అన్నీ తలకట్లే!

ఈ క్రింది పద్యంలో అన్ని అక్షరాలకూ తలకట్లే; అక్షరం క్రింద అక్షరంగాని, సున్నలుగాని లేవు!

పరమదయాకర శుభకర
నరవరనుత గరుడగమన నగధరపరమ
మురహార భవహార మాధవ
ధరధరనుత ధవళనయన దశరథతనయా॥

# తోకలేని శ్లోకం

ఈ శ్లోకం మొదటినుంచి కొసవరకు చదివినా, కొసనుండి మొదటికి చదివినా అర్థం చెడకుండా అవే అక్షరాలు!

భోజరాజ మహాదేవ
కాళిదాస మనోహర
రహానోమ సదాళికా
వదేహా మజరాజభో

సంపాదన: కె. జి. సూర్యనారాయణగుప్త (అగళి)

## ఏడుపు వచ్చింది!

నేను ప్రతిరోజూ సాయింత్రం, మావూరి స్టేషను దగ్గరికి షికారు వెళ్తాను. ఒచ్చేపోయే రైళ్లను చూడటం నాకు చాలా సరదా.

ఆనాడు నేను స్టేషనువద్గర అటూ ఇటూ తిరుగుతూవుండగా "బాల" వచ్చింది! "బాల" వచ్చింది! అని కేకలు విన్నాను. పరుగెత్తు కెళ్లాను చాలామంది పిల్లలు "బాల" లు గబగబ కొంటున్నారు. నా జేబులో డబ్బులుకోసం వెతికాను సరిగా 0-5-6 వుంది. అర్ధణా తక్కువ! ఇంటికెళ్ళి డబ్బులు తెచ్చేవోపుగా "బాల"లు అయిపోతాయి. ఏం చేయను? నాకు ఏడుపు వచ్చింది.

రచన: గుండురావు

(అనంతపురము)

## బడి

నీలో జీవం పోయీ
నాలో నెత్తురు చచ్చీ
యేలా యీ చదువులు ఓ
బాలా బడి మూసేద్దాం!

* * *

నే కోరిన పాఠాలూ
నీ కోరిన చట్టాలూ
త్వరలోనే వచ్చును తాం
దర పడకో గురుదేవా!

* * *

రావాలని కోరినవీ
పోవాలని తలచినవీ
రానీ పోనీ బడిలో
మన మెందుకు ఓ బాలా.

రచయిత: శ్రీ గుంటూరి వెంకటశాస్త్రి
టీచరు: హయ్యర్ ఎలిమెంటరీ బాలికా పాఠశాల, మోర్త.



# కొంటె కిష్టయ్య అట్లతద్ది

డి. ధనంజయ, 3-వ ఫారం.
డి. తిమ్మేశ్వరరావు, 1-వ ఫారం.
తణుకు.

అట్లతద్ది వచ్చిందంటే కొంటె కిష్టయ్యకి ఒళ్లు తెలియని ఆనందం వస్తుంది. ఉదయం తలంటు కొన్నాడు. కొత్తబట్టలు వేసుకున్నాడు. స్నేహితులయిన శంకరం, సుబ్బన్న, పాతబిందె (ఒక స్నేహితుడి పేరు) తో కలసి పొలాని కెళ్లి దూలగొండ, పల్లేరు కాయలూ కోసుకువచ్చారు. ఆ రోజు రాత్రి ఏంచెయ్యాలో పెద్ద ప్లాను వేసుకున్నారు.

లెక్కల మేష్టారు కామేశ్వర రావుగారంటే కిష్టయ్యకి మంచి కోపం. కిటుకు లెక్కలు యిచ్చి జవాబు చెప్పకపోతే చావకొట్టే వాడు. అందుకోసం ఆయన్ని ఏడిపించాలనుకున్నారు. రాత్రి బాగా వెన్నెలవచ్చాక స్నేహితులతో కేకలు వేసుకుంటూ బయలు దేరాడు.

తిన్నగా లెక్కల మేష్టారు గారింటికి వెళ్లారు. గుమ్మంముందు పల్లేరుకాయలు జల్లి యిలాగ పాడటం మొదలు పెట్టారు.


చింత చెట్టు మీద చిలక
చినకామేశ్వరరావు పిలక
లెక్కలు ఎపుడూ చెపుతాడు.
మక్కలు విరగా తంతాడు.
చిక్కిన నక్కలా వస్తాడు.
మెక్కిన పిల్లిలా చూస్తాడు.
చక్కని పిల్లల కొడతాడు.
అక్కట వీడికి దయలేదు.

లెక్కల మేష్టారు యిది విని దొడ్డిదారిని మెల్లగా వచ్చి కిష్టయ్య జుట్టు పట్టుకున్నాడు. 'ఏమిట్రా పేలు తున్నావు వెధవా!' అన్నారు.

'మిమ్మల్ని పొగుడుతున్నామండి' అన్నాడు కిష్టయ్య ధైర్యంగా. 'ఏదీ పాడు' అన్నారు మేష్టారు. కిష్టయ్య తెలివైన వాడు కాబట్టి ప్లేటు మార్చివేసి యిలా పాడాడు:

చింతచెట్టుమీద చిలక
చినకామేశ్వరరావు చిలక.
లెక్కలు తియ్యగ చెపుతారు
చక్కగ పిల్లల చూస్తారు
చుక్కల కోటును వేస్తారు
టక్కన టక్కన వస్తారు
మ్రొక్కడు మెపుడూ
మేష్టారు.

ఇది మేష్టారువిని సంతోషించి కిష్టయ్యని వదిలారు. యింట్లోకి వెళుతూంటే పల్లేరుకాయలు గుచ్చుకున్నాయి. కిష్టయ్యా స్నేహితులూ చప్పట్లు కొట్టారు. మేష్టారు కదలలేక పోయారు. కిష్టయ్యా స్నేహితులూ యిలాగ పాడుకుంటూ వెళ్లిపోయారు.



అట్లతద్ది. అట్లతద్ది.
ఊరంతా రద్ది.
గజంగజం బద్ది.
మేష్టారికి శుద్ధి.


మేష్టారు ఏం చెయ్యలేకపోయారు. కాని తర్వాత క్లాసులో ఏం చేస్తారో మరి!

[ఈ కథలో వచ్చినపేర్లు కేవలం కల్పితం.]


## "బాల" సంక్రాంతి సంచిక

మంచిమంచి కథలతో, రంగు రంగు బొమ్మలతో
ముచ్చటైన ముగ్గులతో
జనవరిలో వస్తుంది. ముందుగానే జాగ్రత్తపడండి.

# ఆలిబాబా 40 దొంగలు !




[ఈ పైబొమ్మలో ఆలిబాబా, ధనాగారం దగ్గరికి వెళ్లాలి. తోవలో 40 దొంగలు (నల్లచుక్కలు) కాసివున్నారు. వాళ్లకి దొరకకుండా, ఆ బాటలు తప్పించి ధనాగారం చేరాలి. మీరు ఆ త్రోవ చూపగలరా ?

రచన : వి. కస్తూరి (మదరాసు)

కొత్తపుస్తకం ! తప్పక కొనండి !! పిల్లల పుస్తకం !!

# "తెలుగు తల్లి"

ప్రతిబాలుడు, ప్రతిబాలిక తప్పక చదవాలి

ఈ పుస్తకంలో

మన తెలుగుదేశం, పట్టణాలు, పల్లెలు, పరిశ్రమలు, తెలుగు ఆటలు, పాటలు, అందాలు, పండుగలు, తెలుగువీరులు, నాయకులు, కవులు, విజ్ఞానవిషయాలు, అన్నిటిగురించి పిల్లలకు అర్థమయే శైలిలో చక్కని పెద్ద అచ్చుతో, బొమ్మలతో తయారయింది.

రచన: మాగంటి బాపినీడు

ఏజంట్లకు మంచి కమీషను

వివరములకు : జాతీయ జ్ఞానమందిరం

త్యాగరాయనగరము, మద్రాసు.

# జాతీయ పుస్తకములు

| | | |
|---|---|---|
| 1. "నిర్మాణ కార్యక్రమమంటే?" | | |
| మహాత్ముడు, రాజేంద్రబాబు, పట్టాభిగార్ల నిర్వచనములతో | | 0–12–0 |
| 2. "కాంగ్రెసు షష్టిపూర్తి" | | |
| డాక్టరు పట్టాభి | ... ... | 0–12–0 |
| 3. "జై హింద్" | | |
| కాం॥ గోపాలరాయశర్మ | ... ... | 1– 6–0 |
| 4. "మానవుల హక్కులు" | | |
| ఆచార్య మా. వెంకటరంగయ్య | ... | 1– 0–0 |
| 5. "ప్రజాపరిషత్తు" | | |
| (ఇందు వివిధరాజ్యాంగ పరిషత్తుల చరిత్ర విపులముగ చర్చింపబడినది) ఆచార్య మా. వెంకటరంగయ్య | | 1– 8–0 |

పుస్తకములు వలయువారు :

జాతీయ జ్ఞానమందిరం

త్యాగరాయనగరము - మద్రాసు.



# అక్కతో 5 నిమిషాలు

చిట్టి చెల్లాయిలూ !

చిట్టి తమ్ముళ్ళూ !

దీపావళి పండుగనాడు మీ రందరూ ఎంతో సరదాగా ఉన్నారుకదూ? కొత్త బట్టలు, టపాకాయలు, పిండివంటలు-ఓ! అందరికీ పండుగే! దీపావళి పండుగ అంత గొప్పగా ఎందుకు చేస్తారో ఆకథ మీకు తెలుసా? తెలియకపోతే, మీ అమ్మనడిగి తెలుసుకోండి.

*　　　*　　　*

అన్నట్టు దీపావళి అంటే జ్ఞాపకం వచ్చింది. ఈ నెలలో నాకు వచ్చిన ఉత్తరం చాలా బాగుంది చదవండి.

రాజమండ్రి,
26-10-46

అక్కా,

నీకు ఉత్తరం రాయాలని బుద్ధి పుట్టింది. రాస్తున్నాను. నేనిది వరకు ఎవరికీ ఉత్తరాలు రాయలేనందున, ఎలా రాయడమో తెలియదు. కాని నువ్వు పెద్దదానివి కదూ ? అంచేత నా వచ్చీ రాని రాత నువ్వే అర్థంచేసుకో. ఈ వుత్తరం నీకురాస్తేగాని ఉండలేకపోయాను. దేన్నిగురించో తెలుసా ?...మరి విను.

మొన్న దీపావళికి ఏంజరిగిందో తెలుసా? రేపు దీపావళి అనగా, యీ సాయంత్రం మా నాన్నగారు, నాకూ, తమ్ముడికి, చెల్లాయికి కావలసినన్ని మతాబా పెట్టెలు, కాకర పువ్వొత్తులు, సీమ టపాకాయలు, ఎన్నో రకరకాలవి తెచ్చేరు. దర్జీవాడు కొత్తబట్టలు కుట్టి తీసుకొచ్చాడు. ఓ మాసంతోషం ఏంచెప్పను !

దీపాలుపెట్టేవేళకి మానాన్నగారు ఆఫీసునుంచి ఇంటికివచ్చారు. పేపరు చదువుకుంటూ కుర్చీలో కూర్చున్నారు. నాన్నగారూ! ఇవిగో మా కొత్త బట్టలు దర్జీ

తెచ్చేడు. చూడండీ అని అడిగేం. కాని, నాన్న మామాటలు వినిపించుకోకుండా ఏదో అలా పేపరు చూసుకుంటూ విచారంగా కూర్చున్నారు. 'ఏం నాన్నగారూ! అలావున్నారు ? సరదాగా మాట్లాడండీ' అని మేం ఒకళే గోలచేస్తూ అడిగేం. అప్పుడు నాన్న ఆ పేపరు చదివి మాకు చెప్పేరు. 'చూశారా! అమ్మా, తూర్పు బెంగాలు దేశంలో మహమ్మదీయులు, హిందువులను చూస్తే పడక, వాళ్ళని నానా బాధలు పెట్టి, వాళ్ళ ఇళ్లన్నీ పాడుచేసి, ఆస్తి అంతా దోచుకొనిపోయి, చాలామంది చిన్న పిల్లల్నీ, తల్లుల్నీ ఎక్కడికో తీసుకుపోయారట! మగవాళ్ళని చాలామందిని చంపేశారట. పాపం వాళ్ళ పిల్లలగతి యేమిటో!' అన్నారు.

నాన్న మాటలు విని నాకెంతో జాలివేసింది. రాత్రి అన్నం తినేసి పడుకున్నాను. అలా నిద్రపోతూంటే - అక్కయ్యా! ఆ కల తలుచుకుంటే ఇప్పుడుకూడా దుఃఖంవస్తుంది — ఏమయిందో తెలుసా! కలలో ఓ ముగ్గురు చిన్నపిల్లలు, చింకి గుడ్డలతో, చింపిరి తలలతో, తిండిలేక, ఏడుస్తూ నా కెదురుగా నిలబడ్డారు. ఏమిా? ఎందుకు ఏడుస్తున్నారూ? అని నే నడిగాను. వాళ్లు జవాబు చెప్పకుండా ఇంకా అలాగే ఏడుస్తున్నారు. కొంతసేపటికి వాళ్లలో ఒక అమ్మాయి ఏడుస్తూ ఇలా అంది. 'చూసేవా కమలా! మేం ఎలాగున్నామో! మా నాన్నని, మా తాతయ్యని, మా అన్నయ్యని, ఎవరో చంపేశారు. మా యిల్లు కాల్చేశారు. మా అమ్మ ఏమైపోయిందో మాకు తెలియదు. మమ్మల్ని ఆ దుర్మార్గులు ఈ గుడిసెలో దాచేశారు. మాకు ఆకలి అని అడిగినా ఇంత అన్నం పెట్టకుండా వున్నారు.

కమలా! మమ్మల్ని చూస్తే నీకు జాలిలేదూ,'' అని అంది.

అంటే నా కేడుపువచ్చి, నిద్రలోనే గట్టిగా ఏడ్చేనట. ఇంతట్లోకే అమ్మవచ్చి, ''లే! లే! తెల్లవారింది. తలంటిపోసుకొని, కొత్తబట్టలు తొడుక్కోందువుగాని'' అని లేపింది. అమ్మకి సంగతంతా చెప్పేను, అమ్మ

కళ్ళవెంటకూడా నీళ్లు వచ్చాయి. ఇంతట్లోకే నాన్నగారు లేచి వచ్చారు. సంగతంతా విన్నారు, "ఫరవాలేదమ్మా! దిక్కులేని వారికి దేవుడే దిక్కు. దేవుడు వాళ్ళకి తప్పకుండా సహాయం చేస్తాడు" అన్నారు


"నాన్నా! ఆ దిక్కులేని బెంగాలు పిల్లలికి మీరేమీ సహాయంచేయరూ?" అన్నాను.

నాన్న చాల సంతోషించి, బెంగాలుపిల్లల సహాయనిధికి 100 రూ॥ పండుగరోజునే పంపిస్తానని చెప్పేరు. నాకెంతో సంతోషం అయింది. వెంటనే నీకీ వుత్తరం రాసేను. "కమల"

* * *

మన బాలసంఘాలు తూర్పుబెంగాలు లోని పిల్లల సహాయనిధికి సహాయం చేస్తారుకదూ? "అక్క"

## కాయగూరల కష్టాల కథ



అనగాఅనగా బంగాళాదుంపల దేశంలో, తూర్పుతోటలో వంకాయల వేణమ్మ, ఆనపకాయల అంకమ్మ, దోసకాయల దీనమ్మ, అని ముగ్గురు అక్కచెల్లెళ్లు వుండేవారు. ఆ ముగ్గురూ ఎంతో హాయిగా వుంటూవుండగా కత్తిపీటల కోసేస్తాా అనే ఒకడు వీళ్లమీదకి దాడి బయలుదేరాడు. పాపం, దిక్కూ మొక్కూలేని అక్కచెల్లెళ్లు ఏం చేయగలరు? కంట నీరు పెట్టుకుంటూ సహాయానికి చూస్తున్నారు. చూడండి పాపం యీ బొమ్మలో ఎలా ఏడుస్తున్నారో!

# జాబ్ కో
## వస్తువులు
### అన్నీ స్వదేశీవే.

మీకు కావలసినవి — సబ్బులు, నూనెలు, పౌడర్లు మొదలైనవన్నీ జాబ్కోవారే తయారుచేస్తున్నారు. మీరు స్వదేశీవస్తువులనే వాడవలెనని వేరే చెప్పాలా? జాబ్కో మార్కుగల వస్తువులే, అన్నిటి కంటే ప్రసిద్ధమైనవి. స్వదేశీనే కొనుడు. జాబ్కోనే కొనుడు.

★

మేము తయారుచేయు వస్తువులు:

హేర్ గ్రోయర్, స్నో, లిక్విడ్ బ్రిలెంటైన్, బ్రిలెంటైన్, సుగంధపు ఆముదం, సుగంధపు కొబ్బరి నూనె, లైంగ్లిస్, హేర్బాం, శాండల్ ఉడ్ సబ్బులు మొదలైనవి.

★

## జయభారతం కంపెనీ
మదరాసు - బెంగుళూరు - ఎర్ణాకులం.








లివర్ & స్ప్లీన్ వ్యాధు
చే బాధ పడుచు, యిత
ఔషధములచే నివారిం
బడజాలని శిశువులు వేలకొ
లది, యీ అద్భుతౌష
రాజముచే రక్షింపబడిరి.

జమ్మి వెంకట-
రమణయ్యగారి

# లివర్ క్యూర్

జమ్మి వెంకటరమణయ్య గారి 'లివర్ క్యూర్' ప్రసిద్ధిగాంచి
వైద్యులు దీనిని వైద్య శాస్త్రములలో కెల్ల నొక విశేషమై
దిగా శ్లాఘించుచున్నారు.

అందరి కెమిస్టుల వద్ద దొరుకును లేనిచో క్రింది విలాసమునకు
వ్రాయుడు.

## జమ్మి వెంకటరమణయ్య & సన్సు
1/1, బ్రాడీస్ రోడ్డు, మైలాపూర్, మద్రాసు.

ఇంకను : బొంబాయి, కలకత్తా, లక్నో, బెంగుళూరు, తిరు
వాపల్లి విజయనగరములందు కూడ ఆఫీసులు గలవు.

# చక్కని షర్టులు

## అన్ని కాలములకు అందములకు తగినవి

నాజూకు తెలిసిన వారందరూకూడా మద్రాసు చేనేత సహకార సంఘపు, షర్టు గుడ్డలయందే మోజు కలిగియున్నారు. బలమైన పురిగల నూలుతో నాడెమైన నేతవల్ల వేడికిగాని, తడికిగాని వాటి రూపము చెడదు. వెలవనిరంగులలో అనేక డిజైనులలో ఈ గుడ్డలు దొరుకుతాయి.

సరాసరి మగ్గాలమీదినుంచి మీకు : ధోవతులు, చీరలు, షర్టింగులు, తువ్వాళ్లు, అద్దకాలు, జిన్‌గామ్, గౌను గుడ్డలు, చీటీగుడ్డలు, తెర గుడ్డలు, మేజాబల్ల గుడ్డలు, దుప్పట్లు, రుమాళ్లు, లుంగీలు, వుత్త రీయాలు, దోమతెరలు, మెత్తలు, దిండ్లు అన్నియు దొరుకును.

## మద్రాసు సహకార సంఘపు

# చేనేత గుడ్డలు

కంట్రోలు ధరలకు తాజా సరుకు

మద్రాసు హాండ్‌లూమ్ వీవర్సు ప్రోవిన్షియల్
కోఆపరేటివ్ సొసైటి. లిమిటెడ్.
6-ఎ. వుడ్సురోడ్డు, మౌంటురోడ్డు, మద్రాసు.

# దీపావళీ సంచికలు

## ఆనందవాణి

దీపావళికి 'ఆనందవాణి' ధుమాగా 200 పేజీల కానుక ఇచ్చింది. సుమారు 70 రచనలు అన్ని రకాలవీ వున్నాయి. "చిట్టితో చెన్నపట్నం" అని డాక్టరు చిలుకూరి నారాయణ రావు గారు వ్రాశారు. పిల్లలు చదవడానికి ఎంతో బాగుంది. కాని అందరూ చదవ వలసిందే. వెల రూ 1-4 లు. 12, తంబు చెట్టి వీధి, మదరాసు.

★

## కథాంజలి

రెండు ఆర్టు కాగితాలమీద సినీమా తారల బొమ్మలతోను. సుమారు 25 రచనలతోను వుంది యీ దీపావళీ కానుక. అన్నీ కథలే కాకుండా ఇతర రచనలు కూడా వున్నాయి. వెల 12 అణాలు. 32, క్రిష్ణప్ప నాయక్ గుంటవీధి, జి. టి. మదరాసు.

★

## పెంకిపిల్ల

66 పేజీల ప్రత్యేక సంచిక. మామూలు సంచికకు దీనికీ తేడా సినీమా తారల బొమ్మలు ఆర్టు కాగితం మీద వేయడంలో కనిపిస్తోంది. అయిదో, ఆరో, రచనలతో అలరారుతోంది. వెల ఒక రూపాయి. 42, అరండేలు వీధి, మదరాసు.

★

## ఆంధ్రజ్యోతి

సుమారు 170 పేజీల యీ సంచిక చక్కగా అచ్చువేసి ఇచ్చారు. ఆర్టు బోర్డు అట్టతో, వడ్డాది పాపయ్యగారి చక్కని చిత్రాలతో, పేరుపొందిన రచయితల రచనలతో వుంది. ప్రకాశంగారి బొమ్మ జిగజిగ మెరిసేటట్టు బంగారు పూత కాగితంమీద వేశారు. సంచిక వెల 1 రూ. 37, ఆచారప్ప వీధి, మద్రాసు.

★

## ఢంకా

ఢంకావారి ప్రత్యేకసంచిక ఢంకా మ్రోగిస్తున్నట్టే వుంది. జాతీయతను, రాజకీయములకు సంబంధించిన వ్యాసాలు, వ్యాఖ్యలు చాలా వున్నాయి. నాటికలూ, కథలూ లేకపోలేదు. బ్రహ్మగారి కార్టూనుల ప్రత్యేకత కనిపిస్తోంది. వెల 1 రూపాయి. 6, సుంకురామశెట్టి వీధి, మద్రాసు.

ప్రధానాంధ్ర కేంద్రములలో !

**14—11—46 తేది గురువారం ప్రారంభము**




డైరెక్టరు : కోట్నిస్

| | | | | | |
|---|---|---|---|---|---|
| బెజవాడ | — మారుతీ | రాజమండ్రి | — కృష్ణా | తెనాలి | — రత్నా |
| గుంటూరు | — న్యూబాంబే | నెల్లూరు | — వినాయక్ | అనంతపురం | — ఎక్సెల్షియర్ |
| కాకినాడ | — మినర్వా | కర్నూలు | — రాజా | | |

DISTRIBUTORS

*For Andhra, Ceded, & Nizams:*

## CHAMRIA TALKIE DISTRIBUTORS

MADRAS — BEZWADA — GUNTAKAL — SECUNDERABAD.

ఫిలుం కథ:

# గృహప్రవేశం

అనగా అనగా సోమలింగం అనే కుర్రాడు మీటింగులుచేసి ఆడవాళ్లందరూ చెడ్డవాళ్లు, వాళ్లని పెళ్లిచేసుకోకుండా వుంటే మొగాళ్లు హాయిగా వుంటారు అని లెక్చర్లు కొట్టూవుండేవాడు.

ఈ సంగతి జానకి అనే చదువుకొన్న అమ్మాయి విని, కోపంవచ్చి: "ఆడవాళ్ల సహాయం లేకుండా మగవాళ్లు వుండగలరా? ఆడా మగా కలిస్తేనే ఇల్లూ, సంసారం నడుస్తుంది" అని వాదిస్తుంది.

ఈ రెండు పార్టీలకీ తగువే ఈ కథలోని విషయం. అయితే ఇందులో, పాపం, జానకి చాలాకష్టాలుపడుతుంది. సవతితల్లి తులశమ్మకి జానకంటే ఇష్టంలేదు. ఇంట్లో నానా బాధలూపెట్టి, రమణారావు అనే ఒక పోకిరీవాడికి ఇచ్చి పెళ్లి చేస్తానంటుంది. పెళ్ళిచూపులూ, పెళ్ళి ప్రయత్నాలూ జరిగాయి.

జానకికి ఆ సంబంధం ఇష్టంలేదు. ఎలాగ? పాపం, ఇల్లువిడిచి ఒకరోజు రాత్రి వెళ్ళిపోతుంది. దారిలో రౌడీలు ఎదురైతే, దాగుందుకు ఒక ఇంట్లోకి వెళ్తుంది. ఆ ఇల్లు తీరాచూస్తే సోమలింగానిది! ఆడవాళ్ళంటే మండిపడే సోమలింగం, జానకి రావటంచూచి గాబరాపడతాడు. పాపం జానకిమాత్రం ఏం చేస్తుంది. ఆ రాత్రి అక్కడ వుండవలసిందే - ఇద్దరూ ఇలా ఆ గదులో వుండడం సోమలింగం స్నేహితుడు చూస్తాడు. ఇన్ని పెద్ద కబుర్లుచెప్పిన సోమలింగం ఆఖరికి జానకితో వున్నాడని కోపంవచ్చి అన్యాయంగా వాళ్ళిద్దర్నీ నానా అల్లరీ చేస్తారు.

జానకి పాపం, ఎలాగో తప్పించుకొని, ఆఖరికి ఆశ్రమం చేరుతుంది. సోమలింగంకూడా, తన పేరుపోయి, ఆఖరికి ఆ ఆశ్రమానికే చేర్తాడు.

ఇక్కడ ఇలావుండా అక్కడరమణారావు జానకికోసం వెతికి వెతికి ఆఖరికి తెలుసుకుంటాడు. పాపం, జానకిగతి ఏమిటి?-మిగిలినకథ మీరుచూడాలంటే తెరమీద చూడండి.

ఈఫిలుం సారథి కంపినీవారు తీశారు. చాలా బాగుంది. మొదటినుండీ కొనవరకూ నవ్వు పుట్టించే సంభాషణలూ, పాటలూ, సంగతులు వున్నాయి.

రమణారావు పెళ్ళిచూపులు చాలా బాగుంది. తులశమ్మక్క, బాగాచేసింది. జానకి సంగతి చెప్పనే అక్ఖర్లేదు!

పాటలు బలేబాగున్నాయి. ప్రసాద్, సి. ఎస్. ఆర్, భానుమతి, హేమలత బాగా నటించారు. కథ వ్రాసిన గోపీచంద్, ఫిలుం డైరెక్టుచేసిన ప్రసాద్ ఇటువంటి ఫిలుంలు ఇంకా తీస్తే ఎంతో బాగుంటుంది.




## కథ:

బాలా! నీకు సంగీతం వచ్చునా? ఐతే....ఏదీ....ఓపాట పాడూ చూద్దాం?

అమ్మ దొంగా! దొడ్డమ్మ చెప్పినవా? అవికాదు. కృతులు!....అంటే తెలీదూ నీకూ? అవీ పాటలే—కాని సంగీతం మేష్టారివద్ద స-రి-గ-మల దగ్గర్నుంచీ బాగా చెప్పుకోందె పాడటం చాలా కష్టం.

అలాటి కృతులు చేసినవారి పేరు త్యాగరాజు. త్యాగయ్య అని కూడా అంటారు. మన తెలుగువారే. దక్షిణాన తంజావూరికి దగ్గరగా కావేరినది ఒడ్డున ఉన్న తిరువారూరు అనే వూళ్లో ఓ మూరేండ్ల క్రిందట వుండేవారు. చిన్నప్పుడే అన్ని వేదాలూ, శాస్త్రాలూ, పురాణాలూ చదివారు. శొంఠి వేంకటరమణయ్య అనే పండితులవద్ద సంగీతం కూడా నేర్చుకున్నారు.



డైరెక్టర్ వి. నాగయ్య

త్యాగయ్య గారు చాలా భక్తులు. రోజుకు లక్షఇరువది యైదువేల చొప్పున 'శ్రీ రామ' నామం 38-వ యేటనే, 96 కోట్లు జపం చేశారు. అపుడు బాలరామలక్ష్మణులు, చేత్తో విల్లంబులుపట్టుకొని కనపడ్డారు! ఆ సంతోషంలో వీరికి పాటలు చేసే శక్తి కలిగింది. ఒకరోజు ప్రొద్దున్న నారదుడు సన్యాసి వేషంతో వచ్చి 'స్వరార్ణవం' అనే సంగీతం పుస్తకం వీరికి యిచ్చి వెళ్లాడు. అది చదువు

కాని, త్యాగయ్యగారు సంగీతంలో గొప్పపండితులై, పాటలు చాలా చెప్పి, అవన్నీ దేవుడికే కృతియిచ్చారు. అందుచే అవి 'కృతు' లయ్యాయి.

తంబుర, చిడతలూ పట్టుకొని త్యాగయ్యగారు యీ కృతులు పాడుకొంటూ వూళ్లో బిచ్చం యెత్తుకొనేవారు రోజూ. వీరిభక్తీ, కృతులు గురించీ ఆ దేశపురాజు శరభోజమహారాజు విని, వీరికి గొప్పగా వెండి, బంగారునగలూ, ధగధగా మెరిసే జల్తారు సిల్కుబట్టలూ బహుమానంగా పంపాడు. ఆ బహుమానాలు పుచ్చుకోమని అన్నగారూ, వదినెగారూ యెంత బ్రతిమాలినా వినక త్యాగయ్యగారు, తనకు డబ్బు, గొప్పదనం అక్కర్లేదు, దేవుడైన శ్రీరాముడే కావాలని అవన్నీ తిరిగి ఆ రాజుకే పంపేశారు. ఇందుకు అన్నగారికి చాలా కోపంవచ్చి, ఇల్లూ సామానూ పంచుకొని వేరేవుంటారు.

పాపం! త్యాగయ్యగారు, భార్య ధర్మాంబతో అల్లాగే రోజూ వారిభాగాని కొచ్చిన సీతారాముల విగ్రహాల్ని పూజిస్తూండేవారు. శ్రీరామనవమినాడు చాలా గొప్పగా ఉత్సవంచేశారు. ఎక్కడెక్కడి జనం గుంపులు గుంపులుగా వీరింటికి వచ్చి భజనుచేసి, కడుపునిండా భోంచేసి వెళ్లారు. వీరికృతులు వినటానికి శరభోజి మహారాజుకూడా మారువేషంతో వీరింటికివచ్చి ఆనందించి వెళ్లాడు. ఈ వైభవం అంతా చూచి కన్నుకుట్టి వోర్చలేక వీరివదినె, అన్నగార్లు వీ రింట్లోవున్న దేవుని విగ్రహాలు ఒకరాత్రి రహస్యంగా దొంగిలించి కావేరీనదిలో పారేశారు!

మర్నాడుదయాన్నే త్యాగయ్యగారు పూజకై చూడగా దేవతావిగ్రహాలు కనపడలేదు. త్యాగయ్య చాలా దుఃఖించి వాటిని వెతికి తేవడానికై భార్యను ఇంటివద్దనే విడిచి వెళ్ళిపోతారు. దార్లో ఓ భక్తుడు కనుపించి వీర్ని కంచి, తిరుపతి యాత్రలు చేయిస్తాడు.

ఒకరాత్రి శ్రీరాముడు కలలో కనపడి, "ఓ త్యాగయ్యా! నీ విగ్రహములు నీకు దొరుకును. గాన, వెంటనే యింటికివెళ్లి శ్రీరామనవమి ఉత్సవము చేయుము" అని చెప్పగా వెంటనే త్యాగయ్యగారు తిరువారూదుకు బయలుదేరారు.

దార్లో కావేరీనది బాగా పొంగి దాటటానికి వీలులేనంతగా నీరు వచ్చింది. కాని త్యాగయ్యగారు శ్రీరాముణ్ణి తల్చుకొంటూ ఆలాగే ఆ కావేరిలో యీదుతూ పోతూవుంటే తన సీతారాముల విగ్రహాలు ఆ నీళ్లలో దొరికాయి. భగవంతుని దయకు సంతోషిస్తూ ఆ విగ్రహాలతో క్షేమంగా యింటికి చేరారు.

పాపం! ఇంటివద్ద నిద్రాహారాలు మానేసి భర్తకై యెదురుచూస్తూ చాలా జబ్బుపడింది ధర్మాంబ. అయినా, ఆ విగ్రహాలను చక్కగా పూలతో అలంకరించి శ్రీరామనవమి నుత్సవం బాగా చేశారు. ఆ జబ్బుచే ధర్మాంబ చనిపోయింది. కొద్దిరోజులకే త్యాగయ్యగారు సన్న్యాసం పుచ్చుకొని ఓనాడు భజన చేస్తూ చేస్తూ

ప్రాణం వదిలారు. అప్పుడు వారి తల చీలి, అందులోంచి ఎలక్ట్రిక్ దీపంలాంటి ఓవెలుగువచ్చి పైకిపోయి దేవునిలో కలసిపోయింది.

బాలా! ఇంత భక్తులైన శ్రీ త్యాగయ్యగారి కథంతా సినిమా తీశారు శ్రీ నాగయ్యగారు.

అందులో నాగయ్యగారే త్యాగయ్యగారయారు. అన్నీ కృతులే. కాని, తెలుగురాని అరవయ్యర్లూ, వాళ్ని చూచి మనలో కొందరూ - సభలలో పాడేమాదిరి గజిబిజి టక్కిరిబిక్కిరిలాగాక, యెంతో భక్తిరసంగా. అచ్చు ఆ త్యాగయ్యగారిలాగే పాడారు నాగయ్యగారు.

బొబ్బిలి కేశవయ్య అని ఓ గొప్పపండితుడు, శరభోజిరాజుగారి దర్బారులో మద్దెలవాడితో తెగ పోట్లాడుతూ, అక్బరుచక్రవర్తి ఆస్థానగాయకుడల్లే, పాడాడు. అదిచూచి చాలా విచారించారు త్యాగయ్యగారు.

తిరుపతిదేవుడు శివుడనీ, కాదు విష్ణువనీ, కొందరు తెగ పోట్లాడుకుంటూ యుంటారు. ఇది ఒఠి తెలివితక్కువనీ, యిద్దరూకలసి ఒక్కరే అయారని ఓ చక్కటి కృతి పాడి తగవుతీర్చేశారు త్యాగయ్యగారైన నాగయ్యగారు.

శరభోజిరాజు ఆస్థానంలో నాట్యకత్తె అయిన 'చపల' అనే ఆమె మన త్యాగయ్యగారి కీర్తికి వుక్కురోషపడి 'స్వరార్ణవం' యెత్తుకొచ్చి యియ్యమని కోరింది. డబ్బుకాశపడి అన్నగారు, త్యాగయ్యగారి విగ్రహాలను వెతకటానికై వెళ్ళినప్పుడు, యింట్లో జొరబడి, నారదుడిచ్చిన ఆ సంగీతం పుస్తకం ముట్టుకోబోతాడు. అప్పుడో పెద్దకోతి-హనుమంతుడు ప్రత్యక్షమై, గద పట్టుకొని వెంట తరిమి తరిమి కొట్టి ఆ అన్నగారి యిల్లు తగలబెట్టాడు, లంక కాల్చినట్లు. భక్తుడైన త్యాగయ్యను బాధపెట్టినందులకు అన్నగారికీ, వదినెగారికీ, భలేశాస్తి అవుతుందిలే.

తిరుపతినుండి తిరువారూరు వస్తూంటే, దార్లో - అడివిలో - దొంగలు, త్యాగయ్యగారి పల్లకీపై పెద్దపెద్ద బండరాళ్లు కొండమీదనుంచి విసురుతారు. కాని, బాల రామలక్ష్మణులు యిద్దరూ అడుపడి, ఒక్కటీ తగలకుండా, మళ్లీ ఆ దొంగలకే ఆ దెబ్బలన్నీ తగిలేట్టు చేస్తారు.

చూశావా, బాలా! ఎంత భక్తుడో త్యాగయ్య. అందుకనే, మహాభక్తుడైన తులసీదాస్ యింటికివచ్చి పురాణం విన్నట్టే-హనుమంతుడు, త్యాగయ్యగారింట్లో జరిగే భజన్లకుకూడా వచ్చేవాడు, బాలరూపంలో.

బాలా! అన్నీ కృతులైతే నీకు నచ్చదేమో? అక్కడక్కడ హిందూస్థానీ ఠుమ్రీలు, సినిమాసాంగ్సుకూడా వున్నాయి సుమా! మచ్చుకో అష్టపదీ, పదమూనూ; అరవపాటలుకూడా లేకపోలేదు.

కూచిపూడి భాగోతుల జట్టులోచేరి మన బాలలు చాలామంది నాట్యంచేశారు-త్యాగయ్యగారిని మెప్పించి 'ఆనందభైరవి' రాగంలో కృతి చెప్పకుండా చెయ్యాలని. ముఖ్యంగా మన అక్టోబరు 'బాల'లోని పూలబాల 'మధురానగరిలో' అనే పాటకు గొల్లపిల్లగా భలేగా అభినయంచేసింది. చెప్పటం ఎందుకూ? చూచితీరాలంతే! నిజంగా ఆ నాట్యం చూస్తోంటే, ఎంతో ఆనందంగా వుంటుంది.

ఔనా: త్యాగయ్యగారి భార్యా ధర్మాంబ, ఆమూసువాయినా లిచ్చుకొంటూ భర్త ఒళ్ళో చచ్చిపోయే టప్పుడు మాత్రం ఎంతో ఏడుస్తాం - అది సినిమా అనేసంగతి మరచిపోయి, ముందుగానే చెప్పాగాబట్టి నీవు యేడవకు. అయినా ఏడుపు వస్తే - నాగయ్య తీసిన త్యాగయ్యను చూచి వ్రాసిన అన్నయ్యను గుర్తించుకో - తెలిసిందా?





# ఇది చెప్పుకో చూద్దాం ???

## నవంబరు ప్రశ్నలు

### I—అంకెల గదులు

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1 | | | | 1 | 10 |
| | | | | | 11 |
| 2 | | 2 | | 1 | 9 |
| | | 3 | | | 11 |
| 1 | | | | 1 | 8 |
| 10 | 11 | 9 | 11 | 8 | |

ఈ బొమ్మలో కొన్ని నల్ల అంకెలు, కొన్ని కొన్ని తెల్ల అంకెలు వున్నాయి. నల్ల అంకెల వరుసల్లో కొన్ని ఖాళీలున్నాయి. ఆ ఖాళీలు, 1, 2, 3 అంకెలనే ఉపయోగించి నింపాలి. ఉపయోగించిన అంకె తిరిగి దాని ప్రక్కన గాని, దిగువునగాని ఉండకూడదు. అలా పూర్తిచేసి, నల్ల అంకెల వరుస అడ్డముగా గాని, నిలువుగా గాని కూడితే ఆ మొత్తము ఆ వరుస కొననివున్న తెల్ల అంకె రావాలి. మీరు పూర్తిచేయగలరా ?

### II—చిన్నవస్తువు – వింతవస్తువు

1. దోమ నోటికన్నా చిన్నవస్తువు ఏది ?

2. తన్ను తానేమ్రింగి చివరకు మాయమయేది ఏది ?

సంపాదన : కోనే పార్వతీశ్వరరావు, ఏలూరు.

అట్టమీద బొమ్మ: చి॥ గిరిజ (మదరాసు)